నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 8-2-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:148 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

పంట పొలాలు
కోడికత్తికి రక్తం
సంక్రాంతి కాంతి.

వందరోజులు
ప్రజాజీవనం ధ్వంసం
విశ్వవిలాపం.

హౌతీ మురాలు
ఎర్రబడ్డ దారులు
నావల భయం.

నిజం నిప్పులు
అహంభావ ఆహ్వానం
కోపశలభం.

కుక్కలమాంసం
రుచి చేదు కానుంది
ద.కొ.నిషేధం
(దక్షిణ కొరియా)

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

పేదోళ్ళ గద్దరంటే
కాదు ఆదుకునే బొమ్మ
ధనవంతుల గుండెల్లో
నిదుర పోయే జేజేమ్మ.

గొంతులోకి జారిపోయె
కాదు సోడా లెమన్ !
యుద్ధనౌక మరో పేరు
ఏకె ఫార్టీ సెవెన్ !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

మెట్రోలో ప్రయాణించిన రాష్ట్రపతి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 చుట్టూ భద్రతతో కార్లలో ప్రయాణించే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇవాళ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. బుధవారం ఉదయం ఢిల్లీ మెట్రోలో ప్రయాణించారు. ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ వికాస్ కుమార్ కూడా రాష్ట్రపతితో కలిసి ప్రయాణించారు.

ఈ సందర్భంగా మెట్రో ప్రయాణం గురించిన వివరాలను రాష్ట్రపతికి వికాస్ కుమార్ వివరించారు. ఆమె కొందరు అధికారులతో కలసి ఖాళీ బోగీలో ప్రయాణిస్తున్న 27 సెకన్ల వీడియో నెట్లో వైరల్ అవుతోంది. అయితే రాష్ట్రపతి ఎక్కడి నుంచి ఎక్కడి వరకూ ప్రయాణించారు, ఎందుకు ప్రయాణించారు వంటి వివరాలు మాత్రం తెలియరాలేదు.

అనంతరాములుకు డిప్యూటీ సీఎం భట్టి నివాళులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7:తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ, విద్యుత్తు ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, సతీమణి నందిని విక్రమార్కలు మల్లు అనంతరాములుకు నివాళులర్పించారు. ఖమ్మం జిల్లాలోని వైరా మండలం స్థానాల లక్ష్మీపురం గ్రామంలో దివంగత పీసీసీ అధ్యక్షులు, మాజీ పార్లమెంటు సభ్యులు మల్లు అనంతరాములు వర్ధంతి సందర్భంగా వారి వ్యవసాయ క్షేత్రంలో మల్లు అనంత రాములుకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ తరహాలో కొత్త స్టేషన్- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 7:అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ తరహాలో సికింద్రాబాద్ కొత్త రైల్వే స్టేషన్ రూపుదిద్దుకుంటోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు.

ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులు చేస్తున్నారని చెప్పారు. 700 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. 2025 నవంబర్ కల్లా పనులు పూర్తి అవుతాయని వెల్లడించారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయని, అది కూడా త్వరలోనే పూర్తి అవుతుందన్నారు. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని తెలిపారు.

రీజినల్ రింగ్ పూర్తయితే ఆ ప్రాంతాల దగ్గర కొత్త రైల్వే స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడ 22 లిఫ్టులు 30కి పైగా ఎస్కలేటర్లు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రయాణికులు నేరుగా స్టేషన్ లోకి రావడానికి, బయటికి వెళ్ళడానికి గగనతలం నుంచే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం జరుగుతుందని కిషన్ రెడ్డి తెలిపారు.

శ్రీశైలం ఆలయాన్ని దర్శించుకున్న బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

అమరావతి, ఫిబ్రవరి 7 శ్రీశైల భ్రమరాంభ మల్లిఖార్జున స్వామిని బిహార్(ఃతిష్ఠజీతీ) రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు(అనీనిణతీవబబ ఓఒంబ) బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని కృష్ణదేవారాయ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

బిహార్‌కు చెందిన 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్జన పూజలు చేసి దర్శించుకున్నారు. తెలంగాణ ఎమ్మెల్యే వంశీకృష్ణ బిహార్ ఎమ్మెల్యేలకు దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యేలు బిహారుకు వెళ్లారు.

బిహార్‌లో ఇటీవల జేడీయూ, బీజేపీ సంకీర్ల ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం శాసనసభలో ఈనెల12 బలనిరూపణ చేసుకుంటుంది. దీంట్లో భాగంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేజారి పోకుండా ఉండేందుకు ఆ పార్టీ అధిష్టానం రెండు రోజుల క్రితం వారిని తెలంగాణకు పంపి రిసార్ట్స్‌లో ఉంచింది.

చురక

బూతుల రుతురాగం
భ్రష్ట రాజకీయం
పల్లవి చరణాల నిండా
పాట పరమ హేయం.
సమాజంలో సభ్యత
సంస్కారపు జ్ఞానం
వదిలేస్తే పరువంతా
ప్రజల్లోనా కడుహీనం

–వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం– నేటికి అందం

వారిజనేత్రుని దయతో
కూరిమితో క్రికెటునందు క్రొత్త రికార్డున్
భారత దేశజులు పొగడు
తీరుగ స్థాపించ కపిలదేవుని దలతున్

(8-2-1994 కపిల్ దేవ్ ప్రపంచ రికార్డు స్థాపించిన రోజు..)

–రాధశ్రీ
సెల్:9494481210

ప్రజలంతా సహకరించాలి..ఆర్టీసీని కాపాడుకుందాం- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 7:ప్రజలంతా సహకరించాలని, ఆర్టీసి మనందరిది దానిని కాపాడుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ ని ముందుకు తీసుకుపోవడం లో అందరి సలహాలు కోరుతూ ఆర్టీసీ సంస్థను ప్రజలకు ఉపయోగపడే విధంగా మార్పులు చేర్పులు చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కొండాపూర్ ఎనిమిదో బెటాలియన్ లో టిఎస్ఆర్టీసీ కానిస్టేబుల్ ల పాసింగ్ అవుట్ పెరేడ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వీ.సీ. సజ్జనార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రజల సంస్థ ఇందులో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా వివిధ రకాల ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద 800 మందికి పైగా నియామకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అందులో భాగంగా ఈరోజు కొంతమంది కానిస్టేబుల్ లకి నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆర్టీసీ సంస్థను తిరిగి తెలంగాణ ప్రజలకు నంబర్ 1 రవాణా సంస్థగా ఉంచే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. గతంలో కరోనా, సమ్మె కారణంగా ఆర్టీసీ కి పలు సమస్యలు ఏర్పడ్డాయని అన్నారు. వాటన్నిటి ని అధిగమించడానికి ప్రభుత్వ సహకారం తీసుకుంటుం దన్నారు. నూతనంగా మహాలక్ష్మి కార్యక్రమం ద్వారా ఉచితంగా మహిళలకు ప్రయాణం అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు పద్నాలుగు న్నర కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారన్నారు. అక్యూపెన్సీ రేషియో బస్ స్టాండ్ లు ఖాళీగా ఉన్న పరిస్థితి నుండి బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణం చేస్తున్న సందర్భ ంలో నూతన బస్సుల కొనుగోలు, నూతన సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, క్యాబినెట్ సహకారంతో ఏండి మార్గ దర్శకంలో ముందుకు పోతున్నామన్నారు.

కాంగ్రెస్‌కు 40 సీట్లు దాటవని దీదీ చెప్పింది: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ రాజ్యసభలో మాట్లాడారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ పార్టీకి పశ్చిమ బెంగాల్ నుంచి ఛాలెంజ్ వచ్చిందన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా దాటవని తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ పేర్కొన్నాంని, మీ పార్టీ ఆ 40 సీట్లును కాపాడుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. కాంగ్రెస్ నేత మల్లిఖార్జున్ ఖర్గే నేత చాలా సుదీర్ఘంగా మాట్లాడారని, అంత సమయం ఆయన ఎలా మాట్లాడారని ఆలోచించానన్నారు. ఇద్దరు కమాండర్లు లేరని, దాన్ని ఆయన అడ్వాంటేజ్ తీసుకున్నట్లు గుర్తించానన్నారు. అయిసా మౌకా ఫిర్ కహా మిలేగా అన్న పాట రీతిలో ఖర్గే మాట్లాడారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. పత్రికా స్వేచ్ఛను కాంగ్రెస్ మంటగిలిపిందన్నారు. ఉత్తరం, దక్షిణం పేరుతో ప్రజల్ని విడదీస్తోందన్నారు. విపక్షాల దుస్థితికి కాంగ్రెస్ కారణం అయ్యిందన్నారు. ఫెడరలిజం గురించి కాంగ్రెస్ పార్టీ ప్రవచనాలు చెబుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ స్థాయిలో భారత భూభాగాన్ని శత్రు దేశాలకు కాంగ్రెస్ పార్టీ అప్పగించి ందని విమర్శించారు. కాంగ్రెస్‌వి అన్నీ బ్రిటీష్ భావాలే అన్నారు. ఆలోచనల్లో కాంగ్రెస్ పార్టీ ఔట్‌డేట్ అయ్యిందన్నారు. కాంగ్రెస్‌వి అన్నీ పనికిమాలిన ఆలోచనలన్నారు.

రసాయనాలు వాడి పండ్లు విక్రయిస్తే...చర్యలు తప్పవు.. బోధన్ ఎమ్మెల్యే

నిజామాబాద్, ఫిబ్రవరి 7పండ్లు పక్వానికి వచ్చే క్రమంలో హానికరమైన రసాయనాలు వాడితే చర్యలు తప్పవని మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తెలిపారు. బుధవారం మాజీ మంత్రి, బోధ న్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నిజామాబాద్ లోని అర్శపల్లీలో నీ ఫ్రూట్ మార్కెట్ ను సందర్శించారు.

ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి పండ్ల వ్యాపారస్తులతో మాట్లా డుతూ ప్రజలకు నాణ్యమైన పండ్లను అందించాలని, ఎవ రైనా రసాయనాలు వాడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ,పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హంధాన్ ,పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి ,నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశవేణు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి లు పాల్గొన్నారు.

ఖమ్మంలో 10,11 తేదీలలో 7వ మహాసభలు

ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక పదిహేనేళ్ళ ప్రస్థానం

2009లో మనలో మనం గా ఆవిర్భవించి సంవత్సరం తరువాత 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక'గా రూపుదిద్దుకొని అప్పటి నుండి ఇప్పటి వరకు సాహిత్యపరంగా నిరంతర ప్రయాణాన్ని కొనసాగిస్తూ రెండేళ్ళకొకసారి జరిగే మహాసభలకు (7వ మహాసభలు) సన్నద్ధమయింది. పీడిత జనం పక్షాన నిలిచి, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికపరమైన అంశాలు – సాహిత్యంలో వాటి ప్రతిఫలనాలకు సంబంధించి ఆయా విషయాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్న 'ప్రవే'గా పిలవబడే ఈ సంస్థతో ప్రారంభం (15 ఏళ్ళుగా) నుండి కలిసి నడుస్తున్నాను. ప్రజాస్వామిక భావజాలం లక్ష్యంగా ఆ భావజాలంతో కలిసివచ్చే వ్యక్తులను, మేధావులను, సంస్థలను, ప్రజా సంఘాలను కలుపుకుంటూ భిన్న అస్థిత్వాలకు చెందిన స్త్రీల సమస్యలపై రెండేళ్ళకొకసారి మహాసభలను, ఏడాదికొకసారి వార్షిక సదస్సులను నిర్వహిస్తున్నది. ప్రజా ఉద్యమాలలో భాగం పంచుకుంటున్నది. దేశంలో జరిగే అమానవీయ సంఘటనలపై ఎప్పటికప్పుడు తనదైన పద్ధతిలో స్పందిస్తున్నది. ఆయా అంశాలపై చర్చా కార్యక్రమాలను చేపడుతున్నది. అన్ని వర్గాల వారినీ ముఖ్యంగా యువతరాన్ని ఆలోచింపజేయాలనే ధ్యేయంతో పని చేస్తున్న సంస్థ ప్రవే. వర్తమాన సమకాలీన అంశాలపై భౌతికంగానే కాక జూమ్ మీటింగ్‌ల ద్వారా మహిళలు, దళితులు, మైనారిటీల సమస్యలతో పాటు ఇతర ప్రజా సమస్యలను చర్చించడాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తుంది. ప్రజాస్వామిక విలువల పునాదిపై పత్రికల్లో, వేదికలపై, సామాజిక మాధ్యమాల్లో, తమ కలాలను, గళాలను వినిపించడం కూడా తమ కర్తవ్యంగా భావించి ఆ దిశలో ప్రయాణం సాగిస్తున్నది ఈ వేదిక.

సంస్థ సభ్యులందరూ ప్రణాళికాబద్ధంగా నడుచుకుంటూ, ఒక కుటుంబంగా ఉంటూ స్నేహ వాతావరణంలో చైతన్యాన్ని విస్తరింపజేసే ప్రయత్నంలో ప్రవే తనవంతు కృషి చేస్తున్నది. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలతో ముడిపడి ఉన్న సమస్యలపై అధ్యయనం చేసే సంకల్పంతో వివిధ ప్రాంతాలలో క్షేత్ర పర్యటనలను చేపడుతున్న ప్రవే ఆ అనుభవాలన్నింటినీ పుస్తకాలుగా ప్రచురిస్తున్నది. వీటితో కలిపి ప్రవే సభ్యులు రాసిన కథ, కవిత్వం, సిద్ధాంత గ్రంథాలు, విమర్శా వ్యాసాలకు సంబంధించి ఇప్పటి వరకు 23 పుస్తకాలను (సంకలనాలు, సంపుటిలు) ప్రచురించింది. వివిధ సాహిత్య ప్రక్రియలపై ప్రవే సభ్యులను చైతన్యకరించే ఉద్దేశ్యంతో ఆయా అంశాలపై నిష్ణాతులైన వక్తలచే కార్యశాలలను నిర్వహిస్తున్నది. గత సంవత్సరం జిజ్ఞాసా వేదికతో కలిసి 'స్త్రీవాద సిద్ధాంతం – సాహిత్య విమర్శ' అనే అంశంపై వరుసగా 35 వారాల పాటు అంతర్జాల సమావేశాల పరంపరను చేపట్టింది. ఈ కార్యక్రమం ప్రవే సభ్యులకే కాక, సాహిత్యరంగంలో ఉన్న ఎంతో మందికి ఉపయుక్తమయింది. పిల్లల్లో, యువతలో పఠనాసక్తిని, రచనాసక్తిని కలిగించాలనే లక్ష్యంతో రెండు రాష్ట్రాల్లోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు 'సాహిత్యోత్సవం' (బడి పిల్లలతో రచయితలు) పేరుతో వాళ్ళను సమూహాలుగా ఏర్పరచి, ప్రవే సభ్యులు వాళ్ళలో తామూ ఒకరై వాళ్ళతో చదివించడం, రాయించడం కూడా ప్రవే చేపట్టిన కార్యక్రమాల్లో ఒకటి. మన 'సాహిత్యం – మన ముచ్చట' లో భాగంగా నెలనెలా సాహిత్య సంవాదం అనే కార్యక్రమాన్ని అంతర్జాల సమావేశాల ద్వారా నిర్వహిస్తూ సాహిత్య విస్తరణ కోసం పని చేస్తున్నది. ప్రవే ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమాలన్నీ సాహిత్యాన్ని విమర్శనాత్మకంగా అధ్యయనం చేయడం, ఆ దృష్టితో సామాజిక సందర్భానికి అన్వయిస్తూ నిర్మాణాత్మకంగా రచనలు చేయడం, భాష విషయంలో, పదాల వాడకం విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలు లాంటి విషయాలను నేర్చుకుం టూ సాహిత్యాభిరుచిని మెరుగుపరుచు కోవడానికి ప్రవే ఎప్పుడూ కృషి చేస్తూనే ఉంటుంది. ప్రవే సభ్యులందరూ తాము నేర్చుకుంటూ, తమకు తెలిసిన విషయాలను తోటి సభ్యులతో, సమాజంతో పంచుకోవా లనే ఆశయంతో ముందుకు నడుస్తున్నారు.

విభిన్న అంశాలపై రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా 2022లో (రెండేళ్ళకొక్రతం) 'అనువాద సాహిత్యం – స్త్రీల సందర్భం' అనే అంశంపై గుంటూరులో మహాసభలు నిర్వహించిన ప్రవే ఇప్పుడు ఖమ్మంలో 'స్త్రీలపై ట్రోలింగ్' అనే విషయంపై ఈ నెల ఫిబ్రవరి 10, 11 తేదీలలో 7వ మహాసభలను జరుపుకోబోతున్నది. ఇట్లా 15 సం॥లుగా సాహిత్యం ద్వారా సామాజిక మార్పు కోసం తపనపడుతూ, ఆ పయనంలో ఎదురయ్యే అవరోధాలను అధిగమిస్తూ ముందుకు వెళుతున్న ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక సమాజహితం కోసం మరింత కృషి చేస్తుందని, ఆ కృషిలో నాకూ భాగముందని భావిస్తూ..

–డా॥ కొమర్రాజు రామలక్ష్మి
9849234725

శబరిమల రైల్వే ప్రాజెక్టు కోసం రెండు మార్గాలు పరిశీలిస్తున్నాం: కేంద్ర మంత్రి వైష్ణవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టుకు చెందిన కొన్ని అంశాలను ఇవాళ లోక్‌సభలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఎన్నో ఏళ్ల నుంచి ఆ ప్రాజెక్టు గురించి స్టడీ చేస్తున్నా ఎటువంటి ప్రగతి సాధించలేకపోయామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం అందడంలేదన్నారు.

అయితే శబరిమలకు రైల్వే ట్రాక్ విషయంలో రెండు ప్రత్యామ్నాయ మార్గాల గురించి ఆలోచిస్తున్నామని మంత్రి తెలిపారు. శబరిమల ఆలయానికి వెళ్లే భక్తుల కోసం ఈ రైలు మార్గాన్ని వేయాలని చాన్నాళ్లుగా డిమాండ్ ఉంది. భూసేకరణ, నిధుల కేటాయింపుల్లో రాష్ట్ర సర్కారు సహకరించడం లేదని మంత్రి తెలిపారు.

శబరిమల వరకు రెండు మార్గాల గురించి స్టడీ చేస్తున్నామని, ఒక రూట్లో పంబ వద్దకు వెళ్లే రూటు గురించి ఆలోచిస్తున్నామన్నారు. మరో రూట్లో ఆలయానికి 25 కిలోమీటర్ల దూరం వరకు రైలు వెళ్లే మార్గాన్ని స్టడీ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రెండు మార్గాల గురించి సంపూర్ణంగా అధ్యయనం చేసిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని వైష్ణవ్ చెప్పారు.

చెంగన్నూరు నుంచి పంబ వరకు కొత్త రైల్వే రూటును వేసేందుకు ప్లాన్ చేశారన్నారు. అయితే దీనికి సంబంధించిన డీపీఆర్ సిద్ధం అవుతోందన్నారు. అయితే ఏ మార్గాన్ని ఎంచుకోవాలన్న అంశాన్ని ఫిక్స్ చేసిన తర్వాత శబరి రైల్వే ప్రాజెక్టు పనులు ప్రారంభం అవుతాయని మంత్రి తెలిపారు.

వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం : ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్, ఫిబ్రవరి 7:ఎన్నో సంవత్సరాల వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం బేగంపేట నాలా అభివృద్ధి పనులు, వడ్డెర బస్తీలో రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

ముఖ్యంగా వరద ముంపు సస్యకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి సమస్యను పరిష్కరించామని పేర్కొన్నారు. రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన, నూతన రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థతో మారిన బస్తీల రూపురేఖలు మారాయని చెప్పారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అడవుల వన్యప్రాణుల సంరక్షణ-జిల్లా అటవీ అధికారి ఆశీష్ సింగ్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 7ప్రజల భాగస్వామ్యంతోనే అడవుల, వన్యప్రాణులు సంరక్షణ సాధ్యమని జిల్లా అటవీ శాఖ అధికారి ఆశీస్ సింగ్ అన్నారు. మంచిర్యాల జిల్లా కవ్వాల పులుల అభయారణ్యం జన్నారం నర్సరీలోని కమ్యూనిటీ హాల్లో బుధవారం ఉమ్మడి జిల్లా అటవీ అధికార్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత తరుణంలో అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అభయారణ్యంలోని అడవుల, వన్యప్రాణులను కాపాడుకోవడానికి ప్రజల నుంచి ఫిర్యాదులు, సూచనలను స్వీకరించాలని ఆయన చెప్పారు. ఉన్న అడవులను కాపాడుకోవడానికి చేపట్టబోయే పలు పనులను ఆయన వివరించారు. నిర్మల్, ఆదిలాబాద్ కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల డీఎఫ్ఓలు, ఎఫ్డిఓలు, రేంజ్ , డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్, బిట్ ఆఫీసర్లు రామ్ కిషన్ యాదవ్, వినయ్ కుమార్ సాహు, హాఫీజోద్దీన్, నాగవత్ స్వామి, గులాబ్ మొయినోద్దీన్, హేమలత, శంకర్, జ్ఞానేశ్వర్ ,తిరుపతి పాల్గొన్నారు.

నేటినిజం
సాహితీ కెరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 8-2-2024

నానీ

కొత్త బంధానికి
మురిసిపోకు
అది నీ కనుకొలకుల్లో
మరో చినుకు!

-డా॥ సి. భవానీదేవి
9866847000

సంబరాలం

మనసువిప్పి
మాట్లాడకపోతే ఎలా?
మనమధ్య
అగాధాలు తొలగెదెలా?

స్నేహితులు హితుల్లేతే
బాటలవుంతానిరబు
స్వార్థపరులలైతే
గుణపాఠాలవుతారు.

వెనుకడుగు
వేయకు
విజయుడిని
మరువకు

గుండెమీద బండరాయిగా
ఉండాలనుకోకు
కొండంత అండగా
తోడుండాలని మరువకు.

ఆవేశంతో
ఆచరించకు
ఆఖరున
అలమటించకు

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

'నేటినిజం' క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 7:(నేటినిజం ప్రతినిధి) ఈరోజు క్యాంపు కార్యాల యంలో రాష్ట్ర సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 'నేటినిజం' దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, ప్రజాపోరు సంపాదకులు యూసుఫ్‌బాబు, ఖాన్, షాహిద్ పాల్గొన్నారు.

ఆ మనిషిని బతికించాలి

ఆ మనిషి తప్పిపోయిండు
వెతుకుదాం రండి...
పాతకాలపు మనిషిని పాతరేసిన
ఈ కాలాన్ని పట్టి
చెట్టుకు కట్టేద్దాం రండి.

ఆ మనిషిలో దాగుడు మూతలు లేవు
లోపల ఒకటి బయట ఒకటి అసలేలేదు
ఆ మనుష్యుల్ని
తొక్కేసిన కాలాన్ని పట్టుకోవాలి
పరుగులు తీయకుండా బంధించాలి.

ఈ మనిషిని నిలబెట్టి
ఆ మనిషిని మాయచేసిండు
కొట్టి పడగొట్టి నిలబెట్టే తత్వం
కాలానికే ఉంది
ఈ మనిషిలో పడగవిప్పిన పైశాచికాలు
ఒత్తిళ్లకు లొంగిపోయి
కుస్తీలు పడుతున్నాడు
తనను తాను
ధ్వంసం చేసుకుంటున్నాడు.

సహజత్వానికి స్వస్తి చెప్పి
మర్మమార్గాలను వెతుకుతున్నాడు
ఈమనిషి ఎప్పుడూ ఏదో
లోకంలో ఉంటాడు
కరెన్సీ కట్టల మధ్య నిత్యం
యాతన పడుతూనే ఉంటాడు
దురాశ దొంతరాల మేడలు
కడుతూనే ఉంటాడు
అనునిత్యం
ప్రమాదాలతో పోరాడుతాడు
జీవితాన్ని ఓ రణ రంగంగా
మార్చుకుంటున్నాడు
బతుకు కొరకు స్వార్థపు
వేటగాడిగా మారిండు.

ఈ మనిషికి దూకుడు ఎక్కువ
మంచితనాన్ని ఏనాడో సమాధి చేశాడు
ఊహించని హింసాత్మక ఉన్మాది
దయాగుణం కరెన్సీకి దాసోహమైంది
అందుకే కాలాన్ని పట్టుకుందాం.

అభిమానుల కళ్ళలో కారం కొడుతుంది
ఆరాధకుల గుండెల్లో
గునపాలు దింపుతోంది
యుక్తాయుక్త
విచక్షణ జ్ఞానం మరిచింది
ఆ మనుషుల జాడను
చూపమని అడుగుదాం
ఋతుచక్రం వికటించింది
ఆ మనుషులను మాయచేసింది
ప్రకృతి పంటలు పోయినవి
వికృతి తంటాలు వస్తున్నాయి.

ఈ మనిషి కాలానికి
బానిసై బతుకుతున్నాడు
మనిషి ఎప్పుడైనా
కాలగమనంలో కలిసిపోతాడు
కాలాన్ని అధిగమించే
సత్తా తెగువ మనిషికి లేదు
అక్షరయోధుడైనా..భిక్షగాడైనా
కాలంతో పోటీపడలేడు
అందుకే
అడుగులు వేయక ముందే
అడ్డుపడదాం రాండి..
కదలిరండి.

మరికొన్ని దశాబ్దాలు పోతే
ఈ మనిషి ఏమై పోతాడో!!
ఎందరిని బాధపెడుతాడో!!
మనిషి ఎదుగుతున్నాడు
కానీ అందరిమీదా
ఏడుస్తున్నాడు
ఈ మనిషి
మారాలంటే మార్చాలంటే
కదిలిపోయే
కాలాన్ని పట్టుకోవాలి
కాలంతో
మనిషికి ఉన్న బంధాన్ని
తప్పించాలి
ఆ మనిషిని బతికించాలి
ఈ మనిషికి గుణపాఠం
చెప్పించాలి
మార్చురావాలి
మనిషిగా బతకాలి

-అంబటి నారాయణ
9849326801

కనిపించే కాల ధర్మం

నేనెప్పుడు చూడలేదు పాత
ఉదయాలను
ప్రతి ఉదయం నవోదయమే !
ఉదయ సంధ్యా సమయాలు
ఎప్పుడూ ఆహ్లాదకరమే !
ఉదయాలను ఎన్ని చూస్తున్నా
ప్రతి ఉదయం
కొత్తగనే ఉదయిస్తుంది కదా !
పాత ఉదయం అంటూ ఉండదు
పాతబడిపోవడం అంటే
మెల్ల మెల్లగా అంతరించి పోవడమే!
చల్లని సాయంత్రాలు మండు
టెండలు కొత్తగానే
నిరంతరం క్షణం క్షణం అనుక్షణం
కాలం రోజు సరి కొత్తగానే !
కాలం కనిపించదేమో కానీ
కనిపించే ప్రకృతి పరిణామం
కాల ధర్మమే !
కాలానికేమి ! దేన్నీ పట్టించుకోదు!
నవ్వులను దుఃఖాలను
కావడి కుండలుగా సమానంగా
మోసుకుపోవడమే!
తామరాకుపై నీటి బొట్టు చందంగా
ఏమీ పట్టనట్టు!
కాలాన్ని అనుకరిస్తే
ప్రతిరోజు
కొత్తగా సరికొత్తగానే !

-పి.బక్కారెడ్డి
9705315250

సప్తపదులు వాట్సప్ గ్రూప్ లో చేరి నియమానుసారం మీరు రాసిన సప్తపదులు పంపించవచ్చు. వారం వారం అందులోంచి ఎంపికయిన 25సప్తపదులు నేటినిజం లో ప్రచురితమవుతాయి.

జయప్రదం
ఫలప్రదం
వసంతపంచమి రోజున
పసుపు దుస్తులు శుభప్రదం
-సింగీతం విజయలక్ష్మి
చెన్నై

తెలుపు
వలపు
ఎద మూసేస్తే వినబడునా
ప్రేమ పిలుపు
-పీకే దుర్గాప్రసాద్
విశాఖపట్టణం

తరంతరం
నిరంతరం
ఒకరి తలపులలో
ఒకరైనప్పుడు లేదిక అంతరం
-శేష శైలజ (శైలి),
విశాఖపట్నం

స్నేహాలు
మోహాలు
ప్రేమికుల దినోత్సవ సంబరాలకై
రకరకాల వ్యూహాలు.
-యదవల్లి విజయలక్ష్మి
రాజమండ్రి

పొంగిపోకు
లొంగిపోకు
గుప్పెడేసి నీ గుండె లోతు మరచిపోకు
-జూపూడి హనుమంతరావు
హైదరాబాద్

మొలకలు
మెలికలు
గుండెగొంతుకలో కొట్టుమిట్టాడే
యవ్వనపు తొలిప్రేమ పులకలు.
-ఆర్ ఎస్ రాజకుమార్
విశాఖపట్నం

కిలకిలా
ఇలకిలా
అందాల ఆమని వచ్చింది ఆనందాల
కలికిలా.
-భాగ్యశ్రీ ముత్యం
కొవ్వూరు.

చదవాలి
ఎదగాలి
ఎంత చదివినా మంచిపేరు
సంపాదించాలంటే ఒదగాలి.
-డాక్టర్. షహనాజ్ బతుల్
హైదరాబాద్

దేహం
మోహం
వసంతపంచమి విన్యాసాలతో
మనసులు సదా దాసోహం!
-యన్.కే. నాగేశ్వరరావు. పెనుగొండ.

సంయోగం
వియోగం
రెండింటి కలయికలోనే వలచు
జంటలకు శృంగారరసయోగం !!!
-అంగర వెంకట సత్య గోపాలస్వామి,
తూరంగి ,కాకినాడ.

వలలు
అలలు
ప్రేమసాఫల్యంతో ప్రేయసీప్రియులకు
నెరవేరును వారి కలలు.
-వేము విజయ్ కుమార్
మనుబోలు నెల్లూరు జిల్లా.

బంగారం
శృంగారం
రుక్మిణి ప్రేమకు దిగివచ్చిన శ్రీకృష్ణుని
తులాభారం
-కట్టెకోల చిన నరసయ్య, ఖమ్మం

మోహం
ద్రోహం
కచ్చుకాలన్నీ కుత్రితాలని తెలిసాక
ఇగిరిపోతుంది స్నేహం
-విన్నకోట ఫణీంద్ర, హైదరాబాద్

వలువ
విలువ
పలుచన కాకూడదు.
తెలుసుకో ఓచెలువ
-కాదంబరి శ్రీనివాసరావు
తిమ్మాపురం

సమయం
ప్రేమమయం
సాయం -లోకం విధి.
వక్రిస్తే చీకటిమయం
-గంగరాజు పద్మజ
మలక పేట ,హైదరాబాద్

పుట్టి
గిట్టి
సాధించిన దర్పాలన్నిటినీ చివరికి
కలిపేసుకుంటుంది మట్టి.
-క్రొవ్విడి వెంకట బలరామమూర్తి
హైదరాబాద్.

నలుపు
తెలుపు
వర్ణమేదైనా అంతరంగ సౌందర్యమే
అసలైన గెలుపు
-మామిడాల శైలజ
వరంగల్.

తొలిపిలుపు
మలిమలుపు
భారతంలో శకుంతలోపాఖ్యానం
మోసపోకూడదని ఆడపిల్లలకు
మేలుకొలుపు
(వివరణ: తొలిపిలుపు = ఆశ్రమంలో వలపు.
మలిమలుపు=సభలో నిరాకరణ)
-కె.వరలక్ష్మీదేవి
కర్నూలు

వసంతుడు
జయంతుడు
ప్రేమికుల హృదయాలను కేళీవనం
చేసే కంతుడు!
-గోగినేని రత్నాకరరావు
తెనాలి.

సమయము
ప్రణయము
పాటించాలి సంయమనము
పరుగెత్తుకొని వస్తుంది విజయము
-టీడీ కస్తూరి
హైదరాబాద్

శరణము
చరణము
వసంతపంచమి విద్యార్థులకు
వరములిచ్చు చదువులమ్మ స్మరణము
-అర్చన కోవూరు
హైదరాబాద్

తనువు
మనువు
ప్రేమికులకు కావాలి హృదయాల
మధ్య చనువు
-వి శ్రీనివాస మూర్తి
హైదరాబాదు

పద్యమా
గద్యమా
పదేపదే నా గుండెలో మార్మోగే
రాగజనితసుహృద్యమా
-ఉమాదేవి గోపరాజు పోచంపల్లి
రిచ్మండ్,టెక్సాస్,అమెరికా

అక్షరాంజలి
కవితాంజలి
తెలుగుసాహితీ సప్తపది
సారస్వతానికి సదా స్వాగతాంజలి!
-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య
మహబూబ్ నగర్.



అందలమెక్కిన అందెశ్రీ గేయం

గేయ రచయిత, ప్రజాకవి అందెశ్రీ కి తెలంగాణ ప్రభుత్వం గొప్ప గౌరవం కల్పించింది. ఆయన రచించిన జయ జయహే తెలంగాణ జనని జయకేత నం గీతాన్ని తెలంగాణ రాష్ట్ర మాతృ గీతంగా అధికారికంగా గుర్తిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటిం చారు. ఈ మేరకు ఇవాళ జరిగిన మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిజంగా ఇదొక గొప్ప నిర్ణయం! కవి అందెశ్రీ కి ఇచ్చిన మహా గౌరవం! సినారే ఉంటే ఆయనతో ప్రత్యేకంగా రాయించే వారు! కానీ, తెలంగాణ ఉద్యమం సమయం లో అందెశ్రీ రాసిన ఈ గీతానికి జనం జేజేలు పలికారు. కెసిఆర్ సైతం ఈ గేయాన్ని రాష్ట్ర గీతం గా గుర్తిస్తామని ప్రకటించి ఎందుకో మళ్ళీ మడమ తిప్పారు! మంత్రివర్గం లో పెట్టి జీవో రూపం లో తీసుకు రాలేకపోయారు! రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోకి వస్తూనే తొలి అసెంబ్లీలో అందెశ్రీ కవితను ఉదహరించారు. ఆయన రాసిన గీతానికి ఇవాళ రాష్ట్ర గీతంగా రాజముద్ర వేశారు. ఇక ప్రతి అధికారిక కార్యక్రమాల్లో తొలుత అందెశ్రీ గీతం జయ

జయహే తెలంగాణ గేతాన్ని ఆలపిస్తారు. ముగింపులో జాతీయ గీతం జనగణమన ఆలపిస్తారు.

అందెశ్రీ పేరు ఇక తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయం! అందెశ్రీ ప్రకృతి కవి! జనగాం జిల్లా రేబర్తి కుగ్రామంలో 1961 జూలై 18న జన్మించారు. ఆయన వయసు 62 సంవత్సరాలు! అసలు పేరు అందె ఎల్లయ్య! అనాథ గా గొడ్ల కాపరిగా పెరిగారు. చదువు లేదు కానీ కాకతీయ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. శృంగేరి పీఠం శంకర్ మహారాజ్ చేరదీశారు. ఆర్. నారాయణ మూర్తి సినిమాల్లో పాటలు రాశారు. 2006లో అతను గంగ సినిమాకు అందించిన సంభాషణలకు నంది పురస్కారం లభిం టచింది. బతుకమ్మ సినిమాకు మాటలు రాశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఆశువుగా కవిత్వం చెప్పడం లో అందెశ్రీ అందె వేసిన కలం!

నదులను సాహిత్యం ద్వారా అనుసంధానం చేయాలని ప్రపంచం లోని ప్రధాన నదులన్నీ పర్యటించారు. ఆ పరిశోధనల కావ్యం పుస్తకం రూపంలో వెలుగులోకి రానున్నది! తెలంగాణ శతాబ్దాల పాటలను ఒక్కచోట నిప్పుల వాగు పేరిట గ్రంథస్తం చేశారు. మాయమై పోతున్నాడమ్మా మనిషన్న వాడు ఆయన రాసిన పాటల్లో ఒక సంచలనం సృష్టించి చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశ్వ విద్యాల యాల్లో తెలుగు పాఠ్యంశంగా ప్రవేశ పెట్టి గౌరవించింది. పల్లె నీకు వందనాలమ్మ, గలగల గజ్జెల బండి, కొమ్మ చెక్కితే బొమ్మరాలాంటి పాటలు జనాదరణ పొందాయి. వంశీ సాహిత్య పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, సుద్దాల హనుమంతు జాతీయ పుర స్కారం లభించాయి. మిత్రుడు అందెశ్రీకి శుభాకాంక్షలు. అద్భుత నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అభినందనలు.

-డా॥ మహ్మద్ రఫీ

పుస్తక సమీక్ష

లైఫ్ మేకర్ కవిత్వం

కవిత్వం ఏం చేస్తుంది? అని కవి కె.శివారెడ్డి రాసిన కవిత్వం మనందరికీ తెలిసిందే. మరి స్త్రీ ఏం చేస్తుంది? అని ప్రశ్న వేస్తే ఒక్క జవాబుతో సరిపుచ్చలేం. కానీ, ఆమెను ఒక మాటకు పరిమితం చేసే గృహిణి, ఇల్లాలు, హోమ్ మేకర్ వంటి మాటలకు పరిమితం చెయ్యడం ఎంత అన్యాయం. నాంపల్లి సుజాత వచన కవిత్వం "హోం మేకర్" చదివిన తర్వాత ఆమె లైఫ్ మేకర్ అని గుర్తించాలని అనిపిస్తుంది. 2006 నుండి నెమలీకలు (2006), మట్టి నా ఆలాపన (2009), మట్టి నానీలు (2015), జొన్న కంకి (2020) వంటి కవితా సంపుటాలతో నాంపల్లి సుజాత కవిత్వం తెలుగు కవులకు చిరపరిచయమైనది. ప్రకృతి ప్రియత, సామాజిక వాస్తవికత, తెలంగాణ ప్రాంతీ యత, మహిళా హక్కుల గొంతుక కలగలిసి నాంపల్లి సుజాత కవిత్వం మార్దవంగా, మనోహరంగా ఉంటుంది.

59 కవితలున్న ఈ సంపుటిలో పావలావంతు కవితలు మహిళా జీవితాలను వర్ణించేవి ఉన్నాయి. మహిళ ఉత్పత్తి శక్తిగా అనేక పాత్రలను పోషిస్తున్నది. సంతానోత్పత్తి, వ్యవసాయోత్పత్తి, వస్తూత్పత్తి పాటు పృత్తి పనుల్లో భాగస్వామ్యం వహిస్తున్నది. ఇంటి పని భారాన్ని మోస్తూనే ఎన్నో కళలకు ఆద్యురాలై పోషకురాలుగా ఉన్నది. ఇంటి పనులకు, పిల్లల పెంపకానికి ఆమే ఆధారం. ఆధునిక సమాజంలో ఉద్యోగినిగానూ, రాజకీయ నాయకురాలిగానూ, సైన్యంలోనూ, మహిళా పొదుపు సంఘాల నిర్వాహకురాలిగానూ వివిధ రంగాలలో పురుషులతో సమంగా బరువు బాధ్యతలను మోస్తున్నది. ఇంత విస్తృతంగా విస్తరించినా మళ్ళీ తనను పాత విలువలతోనే తూచడం, చూడడం, మరింతగా హింసకు లోను కావడం ఆమెను కలవరపరుస్తోంది. వంటింటి మహారాణి అని, గృహిణి అని, హోమ్ మేకర్ అని కేవలం పడికట్టు పదాలలో తనను బందీ చేయడం ఆమెకు అగౌరవం కలిగిస్తున్నది. ముందుమాటలో చెప్పుకున్నట్టు స్త్రీని హౌస్ వైఫ్, హోమ్ మేకర్ అనడం తనకు నచ్చదు. అందుకే సుజాత ఇలా అంటున్నారు....

"పేర్లు మారుతాయి కానీ
తీర్లు మారలేదు...
ఒకప్పుడు హౌస్ వైఫ్
ఇప్పుడు
హోమ్ మేకర్ అంటున్నారు...!"

ఉదయం నుండి రాత్రి దాకా తాను ఎన్ని పనులు చేసినా, ఎన్ని పాత్రలు పోషించినా, సమాజమూ కుటుంబమూ తనను చూసే దృష్టి మారకపోవడాన్ని గమనించి, ఈ వెట్టి చాకిరినుండి విముక్తి కలిగేది ఎప్పుడని వాపోతుంది.

"ఇన్ని చేసినా ....
జీతభత్యాలు, వారాంతపు సెలవులూ
లేని పట్టి హోమ్ మేకర్నేనట...!!
లెక్కకు రాని రెక్కల కష్టం...
జాతీయాదాయంలోనన్నా కలుపరు
ఈ చాకిరి పాడుగాను
దీన్నుంచి విముక్తి ఎప్పుడో... !!!
(హోమ్ మేకర్)

స్త్రీల కట్టూ బొట్టూ ఆహార విహారాలపై అమలవుతున్న ఆంక్షలను, సంస్కృతి పేరుతో మతాల కట్టడులను, స్త్రీల మీద జరుగుతున్న అత్యాచార సంఘటనలను, రిమోట్ లా పనిచేసే పురుషాధిపత్యాన్ని, వివక్షను అనేక కవితల్లో ఎత్తి చూపుతుంది. స్త్రీ జీవన పక్షపాతిగా ఉంటూ ఆమె విశ్వాసంతో ఎదిగే వాతావరణాన్ని కల్పించాలని కోరుకుంటుంది. స్త్రీలపై అమలవుతున్న నిర్బంధాలను, నిఘాలను తానే ఛేదించుకొని విశ్వమంతా వెన్నెలలా విస్తరించాలని, నీలి ఆకాశంలా నిలబడాలని ఆకాంక్షిస్తుంది.

ఆయా సందర్భాల్లో అపర కాళీ, ఆది పరాశక్తి వంటి దైవిక రూపాల నుండి, మొల్ల, రాణీ రుద్రమ దేవి, ఝాన్సీ లక్ష్మీ భాయి, సావిత్రీ భాయి ఫూలే వంటి చారిత్రక వ్యక్తుల నుండి స్ఫూర్తిని పొందాలని సూచిస్తుం ది. మరు జన్మంటూ ఉంటె మహిళగానే పుట్టాలని కోరుకుంటుంది. వ్యవసాయరంగంలో పురుషునితో పాటు తానూ భూగోళంలా తిరిగి సూర్యోదయానికి కారణమవుతుంటే రైతు సూరీడు వచ్చాడని చంకలు గుద్దుకుని తనను రైతక్కగా గుర్తించకపోవడాన్ని తప్పు పడుతుంది.

దిశ సంఘటన సందర్భంగా అపరిమిత ధైర్యాన్నిస్తూ కవిత్వ దిశానిర్దేశం చేస్తూ ఇలా సూచిస్తుంది.

నిన్నాక్రమించిన
ఆ మదపుటంగాలను ఒక్క పెట్టున
రాలిపడేట్టు జాడిచ్చి తన్ను....
(దిశా నిర్దేశం)

అట్లాగే, స్త్రీలు పరాధీనలు కాకూడదని, ఉపగ్రహాలు కాకూడదని స్వయం ప్రకాశులు కావాలని తమ బానిసత్వాన్ని తామే పోగొట్టుకోవాలని గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ప్రకటిస్తూ ...

చీకటైనా ... వెన్నెలైనా
పువ్వులైనా ... పున్నమైనా
నీ వెలుగేదో నువ్వే వెలగాలి
నీ నొప్పేదో నువ్వే భరించాలి
నీ ఊపిరి నువ్వే తీయాలి
ఔను ... నిన్ను కాల్చేసే నిప్పునీ



ప్రతులకు:
నాంపల్లి రాములు
ఇ.నెం.3-13-105/2,
శ్రీనివాసపురం, రామాంతపూర్
హైదరాబాద్-500 013.
సెల్: 9848059893

నువ్వే విసిరేసుకోవాలి (పరాధీన)

పొగ చూరిన వసంతం వంటి పాత పుటలను చెరిపేసి కొత్త తొవ్వని తమదైన సిరాతో లిఖించుకోవాలని కోరుకుంటుంది. మహిళల గురించి రాసిన కవితలు మహిళల్లో ఉండాల్సిన నిర్భీతినీ, స్పష్టమైన మార్గాన్నీ సూచిస్తాయి.

ఈ సంపుటిలో సుజాత కవిత్వం లో మరో పార్శ్వం తాను దర్శించిన ప్రదేశాలు, వస్తువుల అంతరంగ ఆవిష్కరణ, స్త్రీ సహజాతమైన సౌందర్య భావనలు అనేకం కనిపిస్తాయి.

ప్రజ్ఞాపూర్, భాగ్యనగరం, రామప్ప, భూదాన్ పోచంపల్లి, బైరాన్ పల్లి, మున్నార్, సొంతూరు, నగరానికి వలస వంటి కవితల్లో విజ్ఞాన విహార యాత్రల్లో, బస్సు ప్రయాణాల్లో, జీవితంలో వివిధ ఊర్లతో పొందిన అనుభూతులను అద్భుతంగా ఆవిష్కరించడం చూడవచ్చు. ప్రజ్ఞాపూర్ రోడ్డుమీద కంకులమ్మే హస్తాలను మసిబారిన సీతాకోకల చేతులుగా గొంతులను ఎడారి కోయిల రొదలుగా వర్ణించడం, డబ్బుల కోసం పరిగెత్తే నిట్టూర్పుల రొదలను ఎండ తోవలో రాలే చెమట బిందువులను గుర్తించి వారిని నిత్యం నిప్పుల కొలిమిలో మాడి మసిబారిన ఎనగర్రగా సంభవించడం కవయిత్రి హృదయమార్దవాన్ని, పేద ప్రజల పట్ల తన చూపును ప్రకటిస్తుంది.

నగరంలో వానను కుందుర్తి కిటికీ లోంచి తొంగి చూస్తోందని మహతీ వాచకంలో రాస్తే సుజాత "వాడు అనుకున్నదే తడవు జల జలా రాలి పడుతున్నాడు, తెగ రెచ్చిపోతూ" అని మహద్వాచకం చేసి కొత్తదనాన్ని తీసుకువస్తుంది. మున్నార్ గురించి రాస్తూ అది ఆదిలాబాద్‌కు అక్క లాగే ఉంటుందని ఉపమిస్తుంది. భాగ్యనగరాన్ని "అబ్బో అప్పుడు పట్నం, మా ఊరి వెలమ దొరసానే" అని దాని దాబునూ దర్పాన్ని ఒక్క మాటలో కళ్ల ముందుంచుతుంది. భూదాన్తా పోచంపల్లిని సందర్శించి తాను పోచంపల్లి సింగిడిని వెంట తెచ్చుకుంటుంది. రామప్పలో శిల్పి ఉలి చమత్కృతిని తలచి "ఎలా తీర్చిదిద్దావయ్యా ఈ సర్వాలంకృత నల్లరాతి సందిని" అని విభ్రమను ప్రకటిస్తుంది. మనిషితోలు కప్పుకున్న గద్దలను ఎదిరించిన వీరబైరాన్‌పల్లి తెగువను కీర్తిస్తుంది.

ఇంటిలోని పాత వస్తువులను నోస్టాల్జిక్ గా రాసిన వాళ్లలో డా. ఎన్. గోపి సార్ ప్రథములుగా కనిపిస్తారు.

గోపీ సార్ పరిచయం తో , కవిత్వ ప్రభావంతో సుజాత గారు రాసిన కవితలు ఈ సంపుటి లో కనిపిస్తాయి. ఇప్పటివరకు ఎవరూ దృష్టి సారించని కొత్త వస్తువులను ఎన్నింటినో నాంపల్లి సుజాత కవిత్వంలో దర్శించవచ్చు.

రవి చూడని వాటిని కవులు చూస్తారనడా నికి నిదర్శనం "మశిగంత పేగు, కష్మే పోపుల పెట్టె, కత్తెర, బిరడా, సంతకం, నెమలీక వంటి కవితలు.

వంటింటిలో ఇప్పుడు పట్టుకార్లు వచ్చినా పూర్వం ప్రతీ పొయ్యి దగ్గరా వేడి పాత్రలను దింపడానికి ఒక మషిగంత పేగు ఉండేది. తన జీవితాన్ని దానితో పోల్చుకొని తన చెలియగా, తనలాగా నిరంతర సేవలతో మాడి మసై తనువు చాలిస్తుందని అన్నప్పుడు హృదయాలను పిండేస్తుంది. కశ్మెను రూపకట్టిస్తూ హుస్నాబాద్ ఎల్లమ్మ తల్లి తీక్షణంగా తెరిచిన కన్నుగుడ్డే కశ్మంటే, నాకు కవిష్మ కనిపిస్తే చాలు ఊరవిష్మనై పోతానని సంబురపడిపోతుంది. పోపుల పెట్టెను వర్ణిస్తూ " బుజ్జి బుజ్జి గదులున్న

వంటింటి చందమామే ఇది ..
రంగుల సింగిడిని తుంచి
చిన్ని చిన్ని అరల్లో
నింపుకున్న వన్నె చిన్నెల పేటిక ఇది" అని పొంగి పోతుంది. కత్తెరను దృశ్యీకరిస్తూ
"దాని కళ్ళల్లోంచి
నా వేళ్ళు ఒడుపుగా దూరి
రంగురంగుల కాగితప్పూలను
వికసింప చేస్తున్నప్పుడు
నా ఆనందం అపురూపం" అని పరమానంద భరితురాలవుతుంది.

కవిత్వానికున్న ప్రయోజనాలతో ఆనందం మొదటిదైతే రెండవది ఉపదేశం కదా! మన చుట్టూ ఉన్న చిన్న ప్రపంచంలోని ఆనందాల్ని తవ్వి తీసి మన ముందుంచి ఉభయానంద కారకమైన ఈ వస్తు కవిత్వం ఎంతో అపురూపం అనక తప్పదు.

నాంపల్లి సుజాత ఒక మహిళగా కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, ఉపాధ్యాయురాలిగా నిత్య ప్రయాణం కొనసాగిస్తూ, తన అభిరుచియైన కవితా రచనను సమాజ పురోగతి కోసం వాహికగా చేసుకుంటూ నిరంతర చలన శీలంగా ఉండడం అభినందనీయం.

-బూర్ల వేంకటేశ్వర్లు,
9491598040

పశ్చాత్తాపం

నేను చెడ్డ వాణ్ణి కాను
నేను చెడ్డ వాణ్ణి కాను-
జీవితమా చిన్నబోకు
జీవితమా చిన్నబోకు-
నాకు హై బీ పీ వుంది
నాకు హై బీ పీ వుంది-
తెలియకుండానే రైజ్ అవుతుంది
తెలియకుండానే రైజ్ అవుతుంది-
అప్పుడు అందర్నీ బాధ పెడతాను
అప్పుడు అందర్నీ బాధ పెడతాను-
చాలా బద్నాం అవుతాను
చాలా బద్నాం అవుతాను-
నేను చెడ్డ వాణ్ణి కాను
నేను చెడ్డ వాణ్ణి కాను-
నీ దయ గొప్పది
నీ దయ గొప్పది-
నీవు లేకపోతే నేనెక్కడ
నీవు లేకపోతే నేనెక్కడ-
నీకు రుణపడి వుంటాను
నీకు రుణపడి వుంటాను-
నన్ను మన్నించు
నన్ను మన్నించు-
నేను సెంటిమెంటల్ ఫూల్ ను
నేను సెంటిమెంటల్ ఫూల్ ను-
ఎక్కువగా ప్రేమిస్తాను
ఎక్కువగా ప్రేమిస్తాను-
జీవితమా మళ్ళీ కలుస్తామో లేదో
జీవితమా మళ్ళీ కలుస్తామో లేదో-
ఈ జన్మలోనే కృతజ్ఞతలు
ఈ జన్మలోనే కృతజ్ఞతలు-
నేను చెడ్డ వాణ్ణి కాను
నేను చెడ్డ వాణ్ణి కాను.

-ఆశారాజు
9392302245

ప్రణయానందవర్ధనం



కవి ఋషి. అందువల్లనే "నానృషి కురుతే కావ్యం" అన్నారు. కవి క్రాంత దర్శి, ద్రష్ట. లోతైన చూపుతో సమాజాన్ని దర్శిస్తాడు. కవి సృష్ట. దర్శించిన దాన్ని రాస్తాడు. కావ్యానికి పరమ ప్రయోజనం ఆనందం. ఆనందంతో పాటు ఉపదేశం ఉండాలి. జగద్ధితంగా రాయాలి. అందువల్లనే 'విశ్వ శ్రేయః కావ్యం' అన్నారు.

స్తంభంకాడి గంగాధర్ వెలువరించిన 'ఆనంద వర్ధనం' కవితా సంపుటి చదివాక 'వాక్యం రసాత్మకం కావ్యం' అనకుండా ఉండలేం. ఆనందవర్ధనంలోని కవిత్వం రసాత్మకం. ఆనందాత్మకం. ఆనందవర్ధనంలో చక్కటి, చక్కటి కవిత్వం ఉంది. కవితా సౌధానికి అవసమైన పటిష్టమైన 'స్తంభాలు' స్తంభంకాడి గంగాధర్ లో ఉన్నాయి. కవి పుంగవునికి కావలసిన 'స్తంభాన్ని' గంగాధర్ ఆనందవర్ధనం ద్వారా వేసుకున్నాడు. కవిత్వాన్ని ఉన్నతంగా, సమున్నతంగా నిలపడానికి, మరింత ఉత్కర్ష కలిగించడానికి గంగాధర్ చేసిన ప్రయత్నం ముచ్చట గొలుపుతుంది. "ఒక వర్షం కురిసిన సాయంత్రపు సంధ్యవు నువ్వే..." వంటి మనోజ్ఞమైన భావనలు మనసును మురిపిస్తాయి. 'మృతి చెందని స్మృతి' కవితలో "కాలం చెరిపివేయలేని అపూర్వమైన వస్తువు జ్ఞాపకం" అని అభివర్ణించడం చాలా గొప్పగా కనిపిస్తుంది. ఒక ఆలోచనను వస్తు రూపంలోకి మూర్తీభవింప జేసేటటువంటి ప్రయోగమిది. సాధారణంగా కవులు జడపదార్థాలకు చేతనత్వాన్ని ఆపాదిస్తారు. ఒక చైతన్యాన్ని వస్తురూపంలో తెచ్చినప్పుడు అది కళ్ళ ముందు కదలాడుతుంది. ఇక్కడ వస్తువు అంటే జడత్వం కలిగిన ద్రవ్యమో, దినుసో కాదు.

'విరహోత్కంఠిత' కవితలో "గుండెల పైన గులాబీ పువ్వుల కోమలత్వపు పైట వేసుకొని.." అని చెప్పడం కవిలోని మెత్తని ప్రణయ భావనకు నిదర్శనంగా భావిస్తాం. మరోచోట "తూరుపున సింధూరం పండిందంటే స్వప్నాలన్నీ రెక్కలు కట్టుకుని ఎగిరిపోతాయి" అని రాయడం ఎంత ఆహ్లాదాన్ని కలిగిస్తుందో! "కార్తీక మాసపు పౌర్ణమి వికసించిందంటే ప్రకృతికి పరమాత్ముడు సీమంతం చేస్తాడు" అంటూ రాసిన 'కవితాభిషేకం' కవితను చదువుతుంటే ప్రతి పాఠకునికి సుఖతర స్మృతి కలుగుతుంది. గంగాధర్ భావనల్లో బలం ఉంది. కవిత్వం అంటే కేవలం వస్తు బలం మాత్రమే కాదు. కవిత్వానికి శిల్పసంవిధానం కూడా అవసరమే. ఎంత గొప్ప వస్తువునైనా తేలికైన వచనంలో తేల్చిపారేస్తే ఎవరూ ఆ కవిత్వాన్ని చదువరు. కళాత్మకంగా చెప్పడమే శిల్పం. అటువంటి శిల్పం ఆనంద వర్ధనం కవిత్వంలో కనబడుతుంది. "హిమశిఖరోన్నత వికాస వ్యక్తిత్వం/ భీతిల్లక, తలవంచక/ నిటారుగ నను నిలబెట్టింది" అంటాడు గంగాధర్. ఈ కవి ప్రతిభావంతుడు. అతడి కవిత్వ నిర్మాణం అద్భుతంగా ఉంది.

కవిత్వం అంటే కొందరు కేవలం శబ్దాలు అనుకుంటారు. శబ్దం అవసరం లేదు, అర్థమయ్యేటట్లుగా తేలిక పదాలతో రాస్తే సరిపోతుందని మరికొందరు అనుకుంటారు. కానీ 'శబ్దార్థౌ సహితౌ కావ్యం' అని అలంకారికులు చెప్పినట్టుగా కవిత్వమంటే శబ్దం, అర్థం రెండూ ఉండాలి. ఆ సంయోజనం లేకుండా మంచి కవిత్వం రాదు. ఆనందవర్ధనంలో శబ్దార్థ సంయోజనం ఉంది. "నిక్వణ నిరర్గళ నిర్గత నిట్టూర్పులు/ విభాకర మయూఖ రేఖలై తాకగా" వంటి వాక్యాలు దీనికి తార్కాణంగా కనబడు తాయి.

ఆనందవర్ధనం కావ్యంలో మనోహరమైన అర్థాలతో అలంకృతమైన పద సముదాయం పుష్కలంగా ఉంది. "నువ్వేవో నాకందనంత దూరంలో/అచల చుంబిత నీరదావళికి అవతల/ తమస్వినీ విచ్ఛిన్న తారాతీరపు గగనసీమలో/ కాంతులీనతుంటావు/ ఇక నేనేం చేయగలను../నన్ను నేను కాలానికి సమర్పించుకోవడం తప్ప!" వంటి భావనలు పాఠకులను ఆకర్షించి సహృదయానందాన్ని కలిగిస్తాయి.

కవిత్వంలో విస్తీర్ణం, లోతు రెండూ సమపాళ్లలో ఉండాలి. కేవలం విస్తీర్ణం ఉండి లోతు లేకపోతే ఆ కవిత్వం నిలబడదు. అలాగే కవిత్వానికి వైశాల్యం కూడా అవసరం. సమాజం నిండా అది పరుచుకోవాలి. ఎంత లోతున్నా విస్తీర్ణం లేకపోతే ఒక బావిలాగా అక్కడికే పరిమితమైపోతుంది. విశాల, గంభీర సముద్రం లాగా, అగాధమైన అర్ణవం వలె కవిత్వం ఉండాలి. 'భాగవతము', 'జీవనవేదం' మున్నగు కవితలు చదివాక గంగాధర్ కవిత్వంలో ఆ విస్తృతి, లోతు రెండూ ఉన్నాయని చెప్పకుండా ఉండలేం.

'అంతర్ముఖం', 'నిన్నేమని పిలవను?' వంటి కవితలు చదివాక గంగాధర్ హృదయం ఎంత మెత్తనిదో పాఠకునికి అర్థమవుతుంది. 'వికాసం' వంటి కవితలు కవిలోని సంస్కార భావాన్ని తేటతెల్లం చేస్తాయి. ఆనందవర్ధనం నిండా ఆత్మ ఉంది. 'నేను' కవితలో "బాల్యంలో దైవత్వం నా సహచరి/ యవ్వనంలో చేతనత్వం నా నేస్తం/ నడి వయసులో మానవత్వం నా సఖి/ వృద్ధాప్యంలో వేదాంతం నాకు తోడు", 'అన్వేషణ' కవితలో "వైరాగ్యం నుంచి వేదాంతం వైపు/ అభిమతాల సారం అర్థం చేసుకోవడానికి/ ఆలోచనల వంతెన నిర్మించాను", 'మృతి' కవితలో "తనను తాను తెలుసుకోని చితి కదా మృతికి రూపం/ తనను తాను తెలుసుకున్న ముక్తి కదా ఆత్మ స్వరూపం", 'తిరోగమనం' కవితలో " నా అంతరంగం లోపలికి నేనే తొంగి చూసినప్పుడు/ నా అంతర్ముఖం ఆవిష్కరిస్తుంది ఒక అపరాధ భావనను" మొదలైన వాక్యాల్లో గంగాధర్ ఆత్మ పఠితుల అంతర్నేత్రాలకు దర్శితమౌతుంది. తత్ఫలితంగా పాఠకుడు సహానుభూతిని పొంది ఆనంద పరవశుడవుతాడు.

కవి యొక్క పద సంపద, సమాస కల్పనలు, అలంకారాలు మొదలైన భాషావరమైన అంశాలు ఆనందవర్ధనాన్ని అద్భుతమైన కావ్యంగా మలిచాయి. గంగాధర్ లోని అధ్యయన శీలత్వం, వాక్ శుద్ధి ఆయన పదసంపదలో ప్రతిబింబిస్తుంది. 'ఏకత్వం కొరకు' కవితలో "నీవంతా ఒక మహస్సు/ నేనంతా నీకై ఒక తపస్సు", "సరిగమల సరసగేయం' కవితలో "నువ్వున్నప్పుడు కంటి చూపులతో/ నువ్వు లేనప్పుడు ఎదురుచూపులతో".... ఇలా శబ్ద వినిమయం మనోరంజకమై ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

కవిత్వంలో కేవలం ఊహలు మాత్రమే కాదు కఠోరమైన నిజాలు కూడా ఉంటాయి. గంగాధర్ ఇంతటి ఆత్మాశ్రయ కవిత్వంలోనూ సామాజిక వాస్తవికత ప్రతిబింబించే కవితలు కూడా రాశాడు. "క్షీరసాగర మథనం చేస్తూ మనిషి విషం కోసం పోరాడుతున్నాడు!" అని 'ఋషిత్వం' కవితలో రాయడంలో కవి యొక్క తాపత్రయం, వేదన కనబడుతున్నాయి. సమాజంలో మలినం పేరుకుపోతే కవి ఏకాంతంలో దుఃఖిస్తాడు. ఆ దుఃఖమే కవిత్వం. మనిషి మనిషిగా ఉండకపోవడం మీదనే కవి తపనంతా!

ఈ కవితా సంపుటి నిండా లాలిత్యమైన పదబంధాలు చాలా ఉన్నాయి. కలలకర్పూరాలు, మంచుపూల వర్షం, నిద్రరాల్చిన స్వప్నం, ఉద్దీపిత ఉషస్సులు, స్వప్న కుసుమాలు వంటి పదప్రయోగాలు భాషా ప్రియుల మనసును కట్టిపడేస్తాయి. గ్రీష్మకన్య, వసంతమోహిని, వర్షసౌగంధిక, శరచ్చంద్రిక, హేమంతరాణి, శిశిరసుందరి వంటి పదాలు కవిలోని ప్రణయారాధనకు ప్రతిబింబం లాగా కనబడుతాయి. 'ఆనందవర్ధనం' లో కవి ఉపమలు, ఉత్ప్రేక్షలు, రూపకాలు విరివిగా, ఔచిత్యంగా ప్రయోగించాడు. 'వికసితం' కవితలో "నీ వదనం చూస్తే పున్నమి చంద్రుడు ఈర్ష్య పడుతాడు/ నీ కురులను చూస్తే కారుచీకట్లు విస్తుపోతాయి" వంటి ఉపమలు ఉత్కృష్టమై శోభిల్లుతున్నాయి. 'ప్రణయగీతం'లో "నీ స్పర్శ ప్రభాత పవన వీచిక/ నీ పలుకు వసంత కోకిల గీతిక/ నీ చూపు పున్నమి శశికిరణం" అని అపూర్వార్థాలను ఉత్ప్రేక్షించడం ఆనందాన్ని కలిగిస్తుంది. జీవన వేదామృతం, మదినది, జీవనవిపంచిక, ఏకాంతవిపంచిక, ఆత్మమందిరం, మనోసుమం, ఆలోచనల వంతెన, హృదయనీరదం, హృదయపత్రం వంటి రూపకాలు ఈ కావ్యం నిండా పుష్కలంగా ఉన్నాయి. సాధారణంగా బింబాధరాలు లేదా అధరచషకం అంటాం. కానీ గంగాధర్ చక్కగా 'అధరమందారాలు' అన్నాడు. చాలా గొప్పగా రాశాడు.

ఇటువంటి మంచి కవిత్వం ఇంకా రావాలి. రాకపోతే ఎడారిని చూసి పచ్చిక బయలు అని భ్రమింప చేస్తారు కొందరు. ఈ కవికి కవిత్వ రహస్యాలు తెలుసు. కవిత్వ శిల్పం తెలుసు. అందుచేత గంగాధర్ కు మంచి భవిష్యత్తు ఉంది. ముఖ్యంగా కవి అంటే ఋషి కావాలి. కవిత్వాన్ని ఒక తపస్సు లాగా భావించాలి. ఋషికి సంబంధించిన లక్షణాలు లేని మహాకవులు ఎందరున్నా వారికి హృదయం వంగదు, లొంగదు. గంగాధర్ లో మాత్రం ఋషి సంబంధ లక్షణాలు ఉన్నాయి. ఆలోచన, ఆచరణలో ఆచరణకే పెద్దపీట. "ఆగిపోతే చావు - సాగిపోతే జీవితం" అన్నాడు కాళోజీ. కాబట్టి ఈ కవి రాయడం కొనసాగించాలి. మనసులోని అభిప్రాయాలను తనదైన శైలిలో ప్రకటించాలి. గంగాధర్ లో భాషాపటిమ ఉంది. చెప్పగలిగిన నేర్పు ఉంది. ఊహా శబలత ఉంది. వస్తువును ఎట్లా నిర్మించాలో తెలిసినవాడు. అందుచేత భవిష్యత్తులో రాయడాన్ని కొనసాగించి మరింత అద్భుతమైన కవిత్వాన్ని వెలువరించాలి. సామాజిక వాస్తవికతపై కూడా దృష్టి పెట్టి ముందుకు వెళ్లాలి. మంచి కవిత్వం చదివే అవకాశం కలిగించిన గంగాధర్ కు ఆశీస్సులు.

ప్రతులకు: స్తంభంకాడి గంగాధర్,
ఇం. నెం. 10-2-448/ఓ,
విద్యానగర్, కరీంనగర్-505001
మొబైల్ నెంబర్. 7386200610

-డా.నలిమెల భాస్కర్,
9704374081

> కవి ఋషి. అందువల్లనే "నానృషి కురుతే కావ్యం" అన్నారు.
> కవి క్రాంత దర్శి, ద్రష్ట. లోతైన చూపుతో సమాజాన్ని దర్శిస్తాడు.
> కవి సృష్ట. దర్శించిన దాన్ని రాస్తాడు. కావ్యానికి పరమ ప్రయోజనం ఆనందం.
> ఆనందంతో పాటు ఉపదేశం ఉండాలి. జగద్ధితంగా రాయాలి.
> అందువల్లనే 'విశ్వ శ్రేయః కావ్యం' అన్నారు.

లక్ష్మణరేఖ!

ఉషోదయంలో కురిసే
వెచ్చని కిరణాలను
జాగ్రత్తగా ఒడిసిపట్టుకో...
శీతాకాలపు నడిరాతిరేల
చలికాచుకోవచ్చు!.

హేమంతంలో కురిసే
మంచు ముత్యాలనేరి
అందమైన మాలను గుచ్చి పెట్టుకో...
క్రోధాగ్ని కీలలు చెలరేగినపుడు
కానుకీయవచ్చు!

మందుటేసవుల్లో
మల్లెల మకరందాలను
ప్రోది చేసుకునుట మరిచిపోవద్దు...
మకిలంటిన
మనసు ఉక్కిరిబిక్కిరైనప్పుడు
ఆ కమ్మని పరిమళాలనాఘ్రాణించుటే
ఓ ఔషధమవుతుంది!.

మనసు స్వచ్ఛ స్ఫటికమైతే...
వెలితిలన్నీ పూడ్చివేయబడతాయి!.
నవ్వు మంచి ముత్యమైతే
ఎదలోని
ద్వేష భావనలు తొలగిపోతాయి!.

ఎదలో చెలిమి తోట నాటితే...
ఆనంద విరులు వికసిస్తాయి!!.

నిన్ను నీవు లక్ష్మణరేఖ దాటనీకుంటే...
ఆ రక్షణ వలయంలో
హాయిగా నిద్రించవచ్చు!

-వెగ్గలం ఉషశ్రీ
9440370066

మత్తు గమ్మత్తు

ఇంటిల్లిపాదిని విడిచి
మందు హాసినితో మత్తుగా గమ్మత్తుగా
నిత్యం స్మరించుకుంటూ..
చక్కని చిక్కని చుక్క స్పర్శకు
మది ద్రవించి
మధురమైన పిలుపుకు పులకరించి
ఆ వాడివేడి చూపులకు
స్రవించి గుటకలువేస్తూ
పెదవుల సొగసులొలికే
చమట బిందువులకు
సొల్లు కార్చుతూ...సోయగాల
సొంపులకు ఇంపుగా
లొట్టలువేస్తూ...చుట్టూ తిరుగుతాం-

మందుహాసిని ప్రేమలో మునిగి
గమ్మత్తు మత్తులో దిగి
నేనొక సుహాసిని
ప్రేమ పిపాసిని అంటూ...
నిరంతరం కల్పనా చతురత తో
మధుర గానాభిలాషిగా మారుతాం-

స్వర్గం ఇక్కడే అన్నట్లుగా తూలుతూ
మడతలతో మాటలను పేల్చుతూ...
వడివడి నడకల తడబాటు అడుగులతో
ఇల్లు పైకెక్కి ఒళ్ళు కైపెక్కి
మందుహాసిని ఒడిలో నిద్రపోతాం-

తనలో శక్తి సన్నగిల్లినా
కుటుంబం కళ్ళు చెమ్మగిల్లినా
పట్టించుకోని పరాయితనం..
అవసరాల వయ్యారిని
అందాల సుందరిని ఒదిలిపెట్టం
కుటుంబ వెతల్ని బరువెక్కిన బతుకుల్ని
నిత్యం మోస్తూ చస్తూ బతుకుతాం-

మందుహాసిని ఇంపైన మధువు
అందరినీ వరించే వధువు
అందుకే మద్యం మధురం
మందుహాసిని సుమధురం-

కంచెలేని మంచె మీద కూర్చోబెట్టి
మానవతోటకు కాపలిగా ఉంచుతున్నాం
దర్జాగా డబ్బులను ఆర్జించే
సొంపులరాణి
ఇల్లాలిని ఈడ్చి తన్నే కీచకులాడి-

ఎన్నెన్నో రూపాలు!!
మరెన్నో పరువాలు!!
కనికట్టు మత్తును తెప్పించే
ఓ మందాకిని...
పెదాలపై చిరునవ్వులు
చెదరనీయని చెలిమికట్టు...
చివరకు అప్పుల నిప్పులు
కురిపించే మత్తుహాసిని..
రోగాల కుంపటిలోకి నెట్టే
మందుహాసిని-

మత్తు గమ్మత్తు అంతూ చూస్తుంది..
కుటుంబాన్ని రోడ్డుపైకి నెట్టేస్తుంది...
అందుకే మందుహాసిని వద్దు..
మందులేని
మమతాను రాగాలే
ముద్దు!!-

-అంబటి నారాయణ
9849326801

గజళ్ళు

కొండను 'ఢీ' కొట్టాలను 'తెగింపుతో' ఎదుగు
సాగరాలు ఈదాలను 'తలంపుతో' ఎదుగు.

ఏ లక్ష్యంలేని చోట ఏమున్నది వృద్ధి..?
కృష్ణబిలం తొలచాలను 'మదింపుతో' ఎదుగు.

మనిషికేది సాటిరాదు, మరో శంక పనికిరాదు
దిగంతాలు కొలవాలను 'దిగ్దృష్టితో' ఎదుగు.

పాలపుంత ఏపాటిది, పాలించాలనుకుంటే
పల్లవించి ప్రతిన బూని 'ప్రదీప్తితో' ఎదుగు.

కూడదు ఏ నిర్లప్తత, స్థితి ఏదైనా శంకర్!
సునామీలు ఛేదించెడు 'సుదీక్షతో' ఎదుగు.

-సూరారం శంకర్
సెల్:9948963141



సునందామృతం

ఘుణాక్షర న్యాయము

ఘుణము అంటే నుసి పురుగు లేదా కర్రను తొలిచే పురుగు. ఘుణాక్షరం అంటే పురుగు తొలచడం వల్ల ఏర్పడిన అక్షరం.

అయితే ఆ పురుగు కావాలని అక్షరంలా తొలిచిందా అంటే అదేం కాదు. అది తొలుస్తూ ఉన్న క్రమంలో ఏర్పడింది. అంతే కానీ ఇక్కడ పురుగు యొక్క ప్రతిభ కానీ, ఆ విధంగా తొలచాలన్న ఆలోచన కానీ లేదు. అప్రయత్నంగా అలా జరిగింది అంతే.

ఇలా వ్యక్తుల ప్రయత్నం ఏమీ లేకుండా జరిగిన మంచి పనిని ప్రస్తావిస్తూ ఈ ఘుణాక్షర న్యాయమును ఉదాహరణగా చెబుతుంటారు.

అసలు ఘుణాక్షరం అనే మాట ఎందుకు వచ్చిందో చూద్దాం. పూర్వం కాగితాన్ని కనిపెట్టని రోజుల్లో రాగి రేకుల మీదనో, తాటాకుల మీదనో రాసేవారన్న విషయం అందరికీ తెలిసిందే.

'చందమామ రావే/ జాబిల్లి రావే/ కొండెక్కి రావే/ గోగు పూలు తేవే...' ఈ పాట తెలియని వారు ఉండరు. ఇలా తాళ్ళపాక అన్నమయ్య అప్పట్లో రాసినవి అన్నీ రాగి రేకుల మీదే రాశారనీ, అలాగే పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గారు కాలజ్ఞానం తాళ పత్రాలపై రాశారనీ మనకు తెలుసు..

వాటిపై మామూలుగా సిరాతో, ఇంకు పెన్నులతో రాయడం కుదరదు. అప్పటికి అవి వాడకంలో కూడా లేవు. ఒక వేళ రాసినా వాటి మీద నిలువదు చెరిగిపోతుంది. అందుకే గంటముతో రాసేవారు. ఇవి చూస్తూ ఉంటే గుంటగా రాతిపై చెక్కినట్లుగా ఉండేవి.

అయితే ఈ తాళ పత్రాలకు చెద పురుగులు లేదా నుసి పురుగులు పట్టి వాటిని కొట్టేసేవి. అలా కొట్టడం వల్ల, పత్రాన్ని తొలచినట్టె కొన్ని అక్షరాల ఒత్తులు, పొల్లులు చెరిగిపోయి, మరో కొత్త అక్షరంగా మారిపోవడం జరిగేది.

ఆ పురుగు ప్రయత్న పూర్వకంగా తొలచడం వల్లే కొత్త అక్షరం ఏర్పడిందని మనం అనుకుంటాం. కానీ పురుగుకు అంతటి జ్ఞానం ఉండదు కదా!. ఇలా ఉద్దేశ రహితంగా జరిగిన మంచి పనిని ఘుణాక్షర న్యాయము అంటారు. దీనికో సరదా కథ ఒకటి ఉంది. ఓ చెరువు గట్టు దగ్గర కొంతమంది స్నేహితులు నిలుచుని మాట్లాడుతూ ఉన్నారు... ఇంతలో ఓ పిల్లవాడు చెరువులో పడి కొట్టుకుపోతుంటే ఆ స్నేహితుల్లోని ఒకతను రక్షిస్తాడు.

అందరూ అతడు చేసిన సాహసానికి పొగుడుతూ వుంటారు.

అతడేమో **"ఇంతకూ నన్ను అందులోకి నెట్టింది ఎవరు?"** ఏడుపు మొహంతో అంటాడు.

మునిగి పోతున్న పిల్లవాడిని చూస్తున్న వాళ్ల తోపులాటలో అతడు అందులో పడిపోవడంతో ఆ పిల్లవాడిని రక్షించడం జరిగిందన్న మాట.

అంతే కానీ అ పిల్లవాడిని రక్షించేందుకు చెరువులో దూకి ప్రాణాలు రక్షించాలన్న తలంపేం లేదు. అనుకోకుండా అతడు అందులో పడటం వల్ల ఆ పిల్లవాడికి మేలు జరిగింది. ఇలా అప్రయత్నంగా జరిగిన మంచి పనిని ఈ ఘుణాక్షర న్యాయంతో పోలుస్తారు.

-పురిమళ్ల సునంద
9441815722

పుస్తక సమీక్షలు

రామప్ప శిల్ప సౌందర్యం- అక్షర శిల్ప కళా సంకలనం

యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా 1162లో రేచర్ల రుద్రుడు నిర్మంపచేసిన అంతర్జాతీయ గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం శిల్ప కళా వైభవాన్ని 153 మంది కవులు 'అక్షర శిల్పం' కవితా సంపుటిగా ఆవిష్కరించారు. ఈ సంకలనానికి దాసరి (జంగిటి) శాంతకుమారి ప్రధాన సంపాదకులుగా సారథ్యం అందించారు. 'తెలంగాణ సాహిత్య కళాపీఠం సిద్దిపేట ప్రచురించిన ఈ సంపుటికి గంగాపురం శ్రీనివాస్ సహ సంపాదకులుగా వ్యవహరించారు. 'రామప్ప హృదయ కళా పూర్ణోదయం' శీర్షికన డా॥ కొండపల్లి నీహారిణి తొలి కవితగా, గంగశ్రీ రచన 'కదలాడని సుందర శిల్పములే' వంటి శతాధిక కవితలు ఈ సంపుటిలో చోటు చేసుకొన్నాయి. ' ఆ నల్లని రాళలో దాగిన కళా సౌందర్యం మహాకవి సినారె హృదయాన్ని కరిగించిన రీతిలో, యింతమంది కవులు రామప్ప కళా వైభవాన్ని స్తుతించడం, పద్య రచనలు, గజల్, పాట ప్రక్రియలతో రామప్ప ప్రతిభను 'ఎట్ల కట్టిండ్రబ్బ' (ముదిగొండ రాజచంద్రిక) వంటి ఎన్నో కవితా హృదయాలు స్పందించడం ప్రశంసనీయం. ఈ సంపుటిలో ప్రచురింపచేసిన కవితలలో, ఆ రాతి గోడలలో నిక్షిప్తమైన మహా సౌందర్యాన్ని కళాత్మకంగా ఆరాధించడంతో పాటు, ఉలి సౌందర్య భంగిమ ప్రతిమల కళాకృతుల తన్మయతతో పాటు, ఆ వైభవోపేత నిర్మాణంలోని సాంకేతిక శిల్ప లావణ్య అద్భుతాలు, పేరిణి నృత్య విన్యాసాల ప్రేరణా చమత్కృతి శిల్పకాంతల సృజనాత్మక సౌంద ర్యాన్ని కవులు ప్రతిబింబింపచేసారు. సాలభంజికలు, మదనికలు, కాకతీయు ల అద్భుత కళా సంపదకు అందర్జీతీయ ఖ్యాతి, గుర్తింపు లభించిన సందర్భంలో సాహితీ కవితా రూపేణా యింత మంది కవుల స్పందనలు అభినందనీయం.



ప్రతులకు:
దాసరి (జంగిటి) శాంతకుమారి,
ఇ.నెం. 18-13-78
గాంధీనగర్, సిద్దిపేట-502 103
సిద్దిపేట జిల్లా
సెల్: 9652483644

-జయసూర్య
సెల్:9014948336

అవిరామం- నక్క హరికృష్ణ



ప్రతులకు: నక్క హరికృష్ణ
ఇ.నెం. 1-37/2, సింగన్న గూడా
కొక్కొండ పోస్ట్, కల్లాక (వయా)
ములుగు మండలం,
సిద్దిపేట-502 336
సెల్: 9848877662

తెలంగాణ సంస్కృతి, పర్యావరణం, మానవీయ విలువలు, సామాజిక అంశాలు యాబైపైగా 'నక్కహరి కృష్ణ' రాసిన కవితలను 'అవిరామం' ఆవిష్కరిస్తోంది. వైవిధ్య భరితమైన ఇతివృత్తాలతో, వివిధ సందర్భాలలో పత్రికలలో ప్రచురింపబడిన కవితలు ఉన్న ఈ సంపుటి, కవి ప్రతిభను చైతన్యవంతంగా వ్యక్తీకరిస్తోంది. మానవతా పరిమళాలు, విశాల సామాజిక అవ లోకన, వివేచనాత్మక ఆలోచనల గాఢ త్వం, హృదయాన్ని కదిలించగల భావోద్వేగం ఈ సంపుటిలో ప్రచురింపబడిన కవితలలో దర్శించవచ్చు. 'ఎండుటాకు' రాలడం, మరో వసంతానికి బీజంగా ఓ కొత్త వర్ణానికి చిగురును స్వాగతించడంగా, కవి మార్పుకు వాగ్దానంగా స్పృశించే భావనలు ఎన్నో చోటు చేసుకొన్నాయి. దశాబ్దాల నిరీక్షణల సిద్ధించిన వసం తం, మానవత్వాన్ని చిగురింపచేసి మనిషితనాన్ని బతికించాలని 'హరి కృష్ణ' తొలి కవితలో అభిలషించి పల్లె విముక్తి ఆశించటం స్పష్టమవుతుంది. సమ సమాజ నిర్మాణానికి చూపుడు వేలు చిన్నదే అయినా పరివర్తనా మూలాల్ని ఆవిష్కరిస్తుంది అంటారు. మిలియన్ మార్చ్ కారణంగా ట్యాంకుబండు పునీతమైన నాటి సందర్భం ప్రస్తావిస్తారు. వైరస్ సంకెళ్ళ పుట్టగా ప్రాణాలను వంచించే విస్తరణ ఆపడానికి విద్యుత్ కంచె అవసరం అంటారు. 'అమరుల ఆశయాలతో' కవితలో అమ్మపంచిన దేహబంధాన్ని తల్లి కోసం పణం పెట్రిస్రు, మేమా ప్రశ్నలమై కాపు కాస్తామంటాడు కవి. వర్తమాన కాలం లో కవిని బాధిస్తున్న అమానవీయత, ఆత్మ దివాలాతనం, కృత్రిమత్వం, బాల్యాన్ని బలి తీసుకుంటున్న వంచ నను ఎండకట్టారు. నాన్నమీద, అవ్వ మీద బతుకు కథల్ని వినిపించారు. ఆచార్య జయశంకర్, ఎస్.పి. తుదిశ్వాసల సందర్భంలో స్పందించా రు. సోమన, పోతన, సినారె వంటి దిగ్గజాలకు అక్షర నివాళి ఘటించారు.

"ఇప్పుడు మనం
ఆత్మీయతలు లేని ధనికులం
ఈ భూగోళం కొత్తగా
అనిశ్చిత వర్ణంలో అగుపి స్తున్నది" కవి నక్క హరికృష్ణ, సామాజిక నైతికత, సృజనాత్మక విలువలు మానవీయత 'అవిరామం' దర్శింపచేస్తోంది.

-జయసూర్య
సెల్:9014948336

సమ్మక్క-సారలమ్మ

తే.గీ. వేట కొరకు కోయదొరలు వెళ్ళినపుడు
అడవిలో పుట్టపై నొక్క ఆడశిశువు
దొరక మేడరాజే పెంచె దుహితగాను
ఆమెసమ్మక్క యనుపేర నలరు చుండె.

తేగీ. చిన్నతనమందు మహిమల నెన్నొజేసె
ఆకు పసరుతో రోగాల నణచివేసె
కొండ దేవతేయనుచును కొలచిరంత
ఎదిగె సమ్మక్క పెండ్లీడుకేగుదెంచె.

సీ. పగిడిద్ద రాజుతో పరిణయ మాయెను
మేడారమేలేటి ఱేడుయతడు
మేడరాజుకు తాను మేనల్లుడేయగు
సమ్మక్క ఎంతయో సంతసించె
వారికి సంతతి సారలమ్మ కలిగె
మరి నాగులమ్మను మురిసికనిరి
కూతులిద్దరుకాగ కొమరు డొక్కడు కల్గె
చివరగా జంపన్న చిన్నవాడు.

ఆ.వె. గడచె ఊండుకల కొన్ని, కాకతీయుల సేన
దాడి చేయరాగ మేడరాజు
పారిపోయి తాను చేరె మేడారము
ప్రాపు కొరకునతని బాగుకొరకు.

సీ. మా కాకతీయులకు కప్పము చెల్లించి
పగిడిద్దరాజు పాలించుచుండె
కరువు కాటకముల కాలము వచ్చెను
మేడార రాజ్యపు మేరయంత
కప్పము కొన్నేండ్లు కట్టలేకుండెను
పగిడిద్దరాజపు పనులు లేక
సామంత రాజుగా మామకాశ్రయమిచ్చి
చెల్లించకుండెను శిస్తుయనుచు
గిరిజనులను రాజు తిరుగుబాటేజేయ
సిద్ధపరచెనని యుద్ధమునకు
తలచి దండెత్తే ప్రతాప రుద్రుడపుడు
మాఘ పౌర్ణమి రోజు మంత్రితోడ
మేలుకొనియు నాడు మేడారమంతయు
ఎదురు నిలచి పోరు కేగినారు
ఇరువురి సేనలు ఎదురెదురు నిలువ
లక్నవరము నందు రాజుకొనెను

తే.గీ. యుద్ధరంగ మందున పగిడిద్దరాజు
వీరమరణము చెందెను పోరు సలిపి
సారలమ్మయు మరణించె సమరమందు
అజిలోననె మరణించెనామె భర్త
నాగులమ్మయు ముగిసెను వేగముగనె.

తే.గీ. ఇదియు తెలిసిన జంపన్న కేడ్పువచ్చె
దొరలి సంపెంగ వాగులో దూకి చచ్చె
నాటినుండియె ఆ వాగు పాటిగాను
పేరుజంపన్న వాగుగా మారిపోయె.

తే.గీ. పితరుడును తనవారలు మృతిని జెంద
వీరనారి సమ్మక్కయే ఘోరముగను
నిలచి రణరంగ మందున నెగయుదెంచి
యుద్ధమే జేయు చుండెను యుక్తిగాను.

ఆ.వె. ఆమె శౌర్యముగని అబ్బురపడె రాజు
వెన్నుపోటు పొడచి వెళ్ళెనొకడు
సమరమందు నింక సమ్మక్క నిలువక
మట్టు దూరమేగి మాయమయ్యె.

తే.గీ. నాలుగడుగులు చిలుకల నగమువైపు
మగువ సమ్మక్క నడచియు మాయమయ్యె
వెంబడించిన వారంత వీడుపడిరి
జాడ తెలియక మనసులో వేడుకొనిరి.

తే.గీ. కొన్ని రోజుల తదుపరి కొండపైన
చెట్టు క్రిందను ఒకపుట్ట చేరువగాను
కుంకుమ భరిణె కనిపించ కోయలకును
ఆదియె సమ్మక్క యనుకొనిరంత గూడ.

తే.గీ. తెలిసియు ప్రతాప రుద్రుడే తేరుకొనెను
ప్రభువు సమ్మక్క భక్తుడై పరవశించి
కోయ దొరలను కప్పము కోరుకుండ
రద్దు చేసెను వెంటనే రాజుతాను.

తే.గీ. కానుకలొసగి సమ్మక్క కరుణకొరకు
జరుప రెండేళ్ళకొకసారి జాతరలను
శాసనము జేసె రారాజు శాంతికొరకు
దాటివేయేండ్లు రాజు తాధన్యుడాయె.

సీ. సమ్మక్క సారక్క జాతర జరుగును
రెండేడ్లకొకసారి దండిగాను
దట్టమైన అడవి గుట్టల ప్రాంతము
మేడారమందున వేడుకగను
మాఘ పౌర్ణమిరోజు మాయమాయె మగువ
సమ్మక్క, ఆనాడె జాతరగును
నాల్గురోజులు సాగునట్టి జాతరలోన
కోట్ల జనులు వచ్చికోరి మ్రొక్క

తే.గీ. తిరిగి వనదేవతలు కానతరలిపోగ
ముగిసిపోవును జాతర ముచ్చటగను
జయము సమ్మక్క సారక్క జయము జయము
జయము గల్గుత మాకును జయము జయము.

(ఫిబ్రవరి 21 నుండి 24 వరకు సమ్మక్క సారక్క జాతర)

సిల్లీ గర్ల్

కథ



-డా॥నందిని సిధారెడ్డి
సెల్:9440381148

1978లో రాసిన కథ

ఎడ్లబండీ!

మువ్వలు!

ఎడ్లబండి పరిగెత్తటం లేదు. ఆగిపోయి వుంది.

మువ్వలు మోగడం లేదు. నిశ్శబ్దంగా వున్నాయి

బండిలోంచి తలపాగా చుట్టుకున్న ధోవతి ఒకటి దిగింది.

అప్పటికే పక్క పక్క ఇళ్లలోంచి జనం, వాన వెలిశాక రంధ్రాల్లోంచి వచ్చే చీమల్లా బయటికి.. నడిబజార్లోకి వస్తున్నారు.

''సాంబయ్యగారిల్లే దుందండి?''

అడిగింది జనం వంక దృష్టి సారించిన తలపాగా.

ఒక చుట్ట మినుకుమని వెలుగు తూ, గుప్పున పొగని వదుల్తూ అంది.

"ఏ సాంబయ్య బాబూ?" ప్రశ్నకు తోడు మరో ప్రశ్న..

"గదే.. గా ఆవుల సాంబయ్య లేడండి.. గా సాంబయ్య"

తల గోక్కుంటున్న చేతితో తలపాగా సమాధానం!

"వాడా, వానిల్లు ఆడ ఆ యాపచెట్లు పక్కన పెంకుటిల్లు కనబడుతాంది సూడుండ్రి, గదే..."

చిక్కు విడిపోయింది.

ధీమాగా ఫోజు పెట్టింది చుట్ట!

తలపాగా బండి ఎక్కి కూర్చుని, 'హయ్', అంది.

మూగలు చిన్నగా మోగుతూ వెళ్లిపోయాయి.

"ఎవరో, సాంబయ్యింటికి సూట్టా లొచ్చినట్టున్నరు. ఏ ఊరోళ్లో, అడుగుడు సుతం మరిసిపోయినం.. అరే," వాపోయింది చిరుగులు పడ్డ ముసలి చీర!

"నిజంగనే.. గిందరముండి గది తెలుసుకోలేకపోతిమి.. ఛ ఛ ఛా."

తమలపాకు నమిలి ఊశింది మరో వొంకాయ రంగు చీర!!

చీరలు..

ధోతులు! కాదు గోచీ గుడ్డలు..

ముక్కు మీద వేలేసుకోలేదు గాని బిత్తెరపోయి చూస్తున్నాయి.

"సాంబయ్యింటికి పెళ్లివాండ్లొచ్చి నారట..."

నాగలి మోసుకొస్తూన్న ఓ భుజం సమస్యను తేల్చేసింది.

ఇంటి ముందు ఎడ్లబండి ఆగిన చప్పుడును మూగలు చెప్పాయి.

''అమ్మా.. వాళ్లొచ్చినట్టున్నారు... జర జల్ది జల్ది.."

మరో ఎర్ర తలపాగా వాకిట్లో కొచ్చి పడింది.

××

జీపు!

దుమ్ము!

జీపు చప్పుడు ఆగిపోలేదు. జోరుగా వుంది.

దుమ్ము నేలని కరుచుకుని లేదు. ఇండ్ల మీదికి లేస్తుంది.

ఆ ఊరి జనం చీమల్లా కాదు ఊసిళ్లలా బయటికొస్తున్నారు.

జనం కళ్లల్లో జీపు కాదు దుమ్ము.. దుమ్మే అంతా!

జీపు ఓ బంగ్లా ముందాగింది.

బంగ్లా పోలీసు పటేల్ శంకరర్రెడ్డిది. వాళ్ల తాతగారు కట్టించింది.

మస్కూరోళ్లు లేచి వచ్చి జీపుకి దండాలు పెట్టారు.

జీపులోంచి 'టక్' చేసుకున్న నల్లకళ్లద్దాల టోపి దిగింది.

వెనకాల చేతిలో కాగితాల కట్ట పట్టుకున్న ముసలి తెల్లబట్ట టోపి దిగింది.

బట్టటోపి బంగ్లాలోకి నడిచింది.

జీపు చప్పుడు వినడంతోటే మెట్లు దిగి వచ్చిన జరీ అంచు ధోవతి ఎదురైంది.

తెల్లటోపీ నమస్కారాన్ని జరీ అంచు ధోవతి మింగింది. ప్రతి నమస్కారం లేదు.

జరీ అంచు ధోవతి నమస్కారాన్ని నల్ల కళ్లద్దాల టోపీ మింగి పూరుకుంది. ఇక్కడా ప్రతి నమస్కారం లేదు.

"కూర్చోండి"

పడక్కుర్చీ కళ్లద్దాల మనిషిని చూసి భయపడింది.

ఏడుస్తో భరిస్తోంది భారాన్ని,

"ఏం చేస్తున్నారు.. క్యాకరే అబ్‌తక్.. పాణీలు జమాబంది.. తక్తాల్ రాస్తున్నారా?"

'అవన్నీ ఎప్పుడో చూసేశాం. ఆఁ అన్నట్లు తమరేం తీసుకుంటారు. టీయా టిఫినా, కాఫీనా..' భయపడుతూనే వుంది అంచుధోతి. నల్ల కళ్లద్దాల కళ్లు ఎర్రబడ్డాయి.

'నేను కొత్తవాడ్ని.. వో కుచ్‌నకో.. దస్తావేజులు, రిజిష్టర్లూ ఎక్కడ?'

అంచు ధోతి ఏం చెప్పాలో అర్థంకాక భయపడ్తోంది.

అదే ఎర్ర చీర..
తను రాత్రి కావలించుకున్న
ఎర్రచీరేనేమో!
ఆ చీర పక్కన ఏడుస్తున్నట్లు
ఓ ముసలి ఎర్ర రుమాలు.

"నేను మరో వూరు వెళ్లిపోయేదు న్నది.. అర్జెంటుగా అవేవో సూపించు."

మస్కూరి రుమాళ్లు బరిసెకట్టెల్లా గా చేతులు కట్టుకుని నిలబడ్డారు.

నల్ల కళ్లద్దాల కళ్లు మండుతున్న ట్లున్నాయ్.

అంచు ధోతి గాలిక్కాదుగాని మాటలకి గజగజ వణుకుతోంది.

అర్థంగాని స్థితి.. దేవుడికి మొక్కుకుంది అంచు ధోతి!

తెల్లటోపీ చెప్రాసి సైగకి అంచు ధోతి పటేల్ లోనికెళ్లాడు.

అంచుధోతి చెవిలో అరగంట సేపు గుసగుస పెట్టింది తెల్లటోపీ.

తెల్లటోపీ గోడ కానుకుని నిల్చుం ది. అంచుధోతి మనసు కుదుటపడింది.

మస్కూరీ వాళ్లు కాళ్లు అప్పుడే వచ్చినట్లు అటొకరిటొకరు పరిగెత్తారు.

ఆకాశంలో ఇంద్రధనుస్సు వంగి నిల్చుంది

సీత మనసులో కాదు. సీత మూసుకున్న కళ్లల్లో ఇంద్రధనుస్సు లాంటిదే నిల్చుంది.

ఆకాశంలో ఇంకా బారెడు పొద్దుంది.

అందరి ఇళ్లలోంచి వంటలయితు న్నట్లు పొగ లేస్తోంది.

సాంబయ్యింట్లో పొగ ముక్కే లేదు.

రోజూ సాంబయ్య ఒకే ఒక బిడ్డ సీత ఈపాటికెప్పుడో వండేది.

సీత పుట్టగానే సాంబయ్య భార్య చనిపోయిందని ఊర్లో అందరూ అంటారు.

సీత ఇంకా పొయ్యి అంటించనే లేదు.

వంట్లో బాగలేదనీ కాదు.. వంట్లో చాలా బాగా వుంది.

హుషారుగా వుంది. సీత చిరిగిన చాప మీద పడుకుని వుంది.

ఆకాశం వుంది. సీత చిరిగిన చాప మీద పడుకుని వుంది.

ఆకాశం తన ఇంద్రధనుస్సును చూసుకుని మురిసిపోతుంది.

వారంరోజుల్లో తన పెళ్లి!

సీత ఒకే ఒక్క సినీమా చూసింది తన పదహారేళ్ల కాలంలో..

ఆ సినిమా రంగుల్లో..

మళ్లా తన కళ్లు సినీమా చూస్తున్నట్లు..

ఈ సినీమా కూడా రంగుల్లో..

కాబోయే మొగుడ్ని ఈరోజూ చూసింది తను.

ఎంత బాగున్నాడు నాగేశ్వరరావు ను తలదన్నినట్టు.

ఇంకా చూడ్డునుగదా ఇంకా బాగుండేది.

అంతమంది చుట్టూరా..

అతను కూడా తనని సరిగ చూడలేక..

నిజంగా, పెళ్లిచూపులకి ఇద్దరి మధ్యా అంతమందెందుకు??

తన పెళ్లయ్యాక..

అతన్నెప్పుడూ చూస్తుండొచ్చు చక్కగా..

అందుకే పెళ్లయి కాపురానికి వెళ్లుతున్న వాళ్లతో అంటారు. 'ఆయన్ని బాగా చూసుకోమ్మా' అని

తను తప్పకుండా ఆయన్ని బాగా.. బాగా చూసుకుంటుంది.

ఓ కలతో మరో కల పెనవేసుకుంటూ..

పొయిలోంచి లేచిన పిల్లి ఉట్టి మీద గిన్నె పడగొట్టింది.

వంట జ్ఞప్తికొచ్చినట్లుగా సర్రున లేచి నడిచింది వంటింట్లోకి.

××

గాలికి మామిడిచెట్టు ఊగుతోంది కిటికీ అవతల!

రెండు ఆకులు రాలి కిందపడ్డాయి.

రెండు కోళ్లు తెగి కిందపడి కొట్టుకుంటున్నాయి మొండాలు.

గోధుమ పూరీలు పెనం మీద పడి అరుస్తున్నాయి.

మస్కూరీ తెచ్చిన సారా సీసాలు వొరసగా నిల్చున్నాయి.

బ్రాందీ, విస్కీల కోసం వెళ్లిన కుర్రాడు బస్తీ నుంచి రాలేదు.

వంటపొయి నుంచి తలాయింపు వాసనలు లేస్తున్నాయి.

'అంతా వచ్చిన నల్లకళ్లద్దాల ఆర్.ఐ.కి మర్యాద'

అనుకుని అంచుధోతి తృప్తి పడింది.

ఆ కళ్లద్దాల చాటునుంచి ఆ కళ్లు ఏదో తక్కువుందని చెబుతున్నట్లు న్నాయి. బట్టటోపి చెప్రాసి అంచుధోతి చెవిలో మళ్లా..

'పుణ్యవతి
బాగానే వుంది.. వొంపు అదీ
అన్నీ వున్నదే.. కానీ...'
అది సావుకారి మాట తప్ప
ఎవరి మాటా వినదు.

గుసగుస.. గుసగుస.. గుసగుసలు!!

××

సూర్యుడు చందనం పూసుకున్నట్లు ఎర్రగా వున్నాడు.

అంచుధోతి ముఖం కూడా అదే రంగులోకి మారుతున్నట్లుంది.

ఆకాశంలో మబ్బులు..

వస్తున్నాయి, వచ్చినట్లే లేచిపోతున్నాయి.

అంచుధోతి వెదడులో అట్లానే–

ఓ మబ్బు నల్లగా వచ్చి కిటికీ ముందాగింది. కాదు తెల్లధోతి ముందాగింది. కాంతమ్మ!

ఆఁ.. అది చెప్పినట్టు వింటుంది. కానీ– ఆవిడలో ఇపుడేమీ లేకుండా అయిపోయిందే! ఆ కళ్లద్దాల ముందు.. అది!

లాభం లేదు. ఈ టైంలో పనికిరాదు.

నల్ల మబ్బు కురవకుండానే లేచిపోయింది.

'ఎట్లా..'

'ఆఁ పుణ్యవతి!'

మరో మబ్బు వొచ్చి నిలిచింది ఎదురుగా..

'పుణ్యవతి బాగానే వుంది.. వొంపు అదీ అన్నీ వున్నదే.. కానీ...'

అది సావుకారి మాట తప్ప ఎవరి మాటా వినదు.

డబ్బు.. డబ్బున్నా ఏమి లాభం లేకపోయింది. తనకోసమి దివరకే!

మెల్ల మెల్లగా ఆ మబ్బా లేచిపోయింది.

వెనకాలే మరోటి!

'బుచ్చమ్మ అన్నివిధాలా అతికిపోయేది. ఎలాంటోన్నయినా ఇట్టే మార్చేసేది.

కానీ, అది ఈ మధ్యనే హాస్పిటల్లో శెరీకయ్యిందట!

ఎట్లా?? ఎట్లా??

సూర్యుడు అస్తమించబోవటం ఆపి బాగా వెలిగాడు.

అంచుధోతి 'బుర్ర'లో చటుక్కున మెరిసింది మెరుపు.

ఛేర్‌లోంచి లేచి, షేర్‌దార్ పనిచేసే తన కింది సాంబయ్య కోసం వెదికాడా పటేల్!

"సీతా!"

తండ్రి పిలుపు విని పొయి దగ్గర్నుంచి లేచింది సీత.

"ఏంది నాయినా?"

"...ఆ ఆఁ.. ఏం జేస్తున్నా వమ్మా.."

"వండుతున్నా.."

''ఇంకా వండలేదా? ఇంతసేపేం జేసినవ్."

"....."

''వంట నేన్జూత్తగనీ– నువ్వెళ్లి పటేలింట్ల బియ్యమట సెరిగి రాపో!"

"నిన్ననే జేత్తి గద నాయినా.."

''నిన్ననే జేసినవా.. మరి మల్లెందుకు రమ్మన్నడూ.. మల్లక్కరున్నయో యేవో.. చీకటయితది జల్ది జేసి రాపో."

"అట్లనే నాయినా.. నువు చెయి గాల్చుకునేవు మల్ల."

సీత సగం గూకిన పొద్దు వంక జూస్తూ పటేలింటివైపు నడిచింది.

××

ఆ గదిలోంచి వెడితే అమ్మగారి గది.. ఆ తర్వాతది వంటగది.

సీత ఆదుర్దాగా నడిచింది.

ఆ గదిలో మనుషుల అలికిడి లేదు.

నిశ్శబ్దం పేరుకున్నట్టు ప్రశాంతంగా ఉంది.

కానీ–

ఏదో వాసన!

ఎన్నడూ లేనిది ఏదో వాసన!

గుప్పుమంది.

సీత వెనక్కి తిరిగి చూసింది.

తలుపులు మూసేసి వున్నాయి.

అయోమయంగా సీత చుట్టూ తిరిగి చూసింది.

నల్ల కళ్లద్దాలు పక్కనపెట్టి నల్ల సీసా లేచింది.

సీతకి భయమేసింది.

వాసన గది నిండిపోయింది. సీసా సీత నోరు నొక్కింది.

గాలి తుఫానులా వీచింది.

ఒక్కసారిగా కిటికీ రెక్కలు సీత రెక్కల్లా టపటపా కొట్టుకున్నాయ్.

××

మట్టిరోడ్డు

పైన ఆకాశం–

మట్టిరోడ్డు తెల్లగా మెరుస్తోంది.

పైన ఆకాశం తెల్లగానే మెరుస్తోంది.

పన్నెండు గంటల సూర్యుణ్ని పెద్ద మబ్బు కప్పేసింది.

మట్టిరోడ్డు మీది నుంచి జీపు సుతారంగా వెళ్తోంది.

నల్ల కళ్లద్దాలెందుకో అటువైపు చూశాయి.

చెట్టు!

చింతచెట్టు!

దెయ్యంలాగుండే ఆ చెట్టు.

నల్ల కళ్లద్దాల చూపులు తీక్షణంగా వున్నాయి.

కొమ్మకి..

వేళ్లాడుతున్న చీర!

ఆ చీర ఎక్కడో చూసినట్టుందే..

ఆ చీర ఎర్రచీర.. ఎక్కడబ్బా..

ఎక్కడో కాదు ఎన్నడో కాదు.. రాత్రి.. అవును రాత్రి.. ఆ చీరనే కదూ..

అదే ఎర్ర చీర.. తను రాత్రి కావలించుకున్న ఎర్రచీరేనేమో!

ఆ చీర పక్కన ఏడుస్తున్నట్లు ఓ ముసలి ఎర్ర రుమాలు.

గుంపు.. సానుభూతిలాగా..

ఆ అంచుధోతి పటేలు ధోతి లాగుందే..

రాత్రి చీర ఉరి పోసుకుందా?

ఆఁ.. ఆఁ.. ఉరి??

అదే నిజమైతే–

షి..షి.. యీజ్ సిల్లీ, పూర్ ఫెలో!!

నల్ల కళ్లద్దాలు పెదాలు చప్పరించాయి.

సీత తాళి కట్టుకోలేదు.

తాడు కట్టుకుంది!

పీటల మీద కూర్చోలేదు.

చెట్టుకు వేలాడుతోంది!

'సిల్లీ గర్ల్..' జీపు మరో ఊరివైపు మలుపు తిరిగింది.

కొత్త శీర్షిక

నాటి తరం వారి కథలు నేటి తరానికి

కథల వంతెన

సమస్యలన్నీ యథాతథమే.
కొత్త సమస్యలు ఎన్నో వచ్చినా
పాతవన్నీ పరిష్కారం కానివే.
ఎన్నో సంఘటనల
యదార్థ వ్యదార్థ
జీవన సారాంశమే కథా కథనాలు.
పాత కొత్తల
మేలు కలయిక కథలసారం.
సరికాని పాత చిక్కులు
విడిపోని గతం ముడులు
నాటి సమాజ స్థితిగతులు
నేటికీ మారని వైనాన్ని తెలుసుకొనే
మహత్తర కథల పరంపర

కథల వంతెన

(నాటి తరంవారి కథలు నేటి తరానికి)

ఈ శీర్షికకు ఆలోచింపజేసే చైతన్యపరిచే 25 ఏళ్ల క్రితం రాసిన కథలకు ఆహ్వానం

–సంపాదకులు

మణిపూసలు

అడవిలేక చినుకుండదు
ఆకలైతె మెతుకుండదు
నరుకుతున్నపుడు అడవిని
నష్టమన్న ద్యాసుండదు!.

ఇచ్చుచుండిన వచ్చును
అడగకుంటే నచ్చును
ఇచ్చే గుణమున్న వాన్ని
ఈశుడైనను మెచ్చును!.

గోడకెన్నెన్నో పోట్లు
తంప్పనివోయి అగచాట్ల
బాధ భరించినా
మానవుల గుండెకుతూట్లు!

చీకటిలేక వెలుగేది?
కష్టములేక సుఖమేది?
జీవన పరిణామంలో
తెలుసుకొనక జ్ఞానమేది?

అపురూపమౌ అమ్మవడి
అభివృద్ధికదే తొలిబడి
యావత్ సృష్టిలోని
బిడ్డలమౌనే కావడి!

మనసును తొలచింది చింత
ఆమె రాలేదని చెంత
మమతనెంత పంచిందో
మరుపన్నదే రానంత!

వీడితెనే తమో గుణము
తోడవునిక సత్వ గుణము
నిన్ను నీవు తెల్సుకుంటె
పరంధాముని దర్శనము!.

అధరాలు మధువులనిచ్చు
హృదయ కమలంబులు విచ్చు
అమలిన మనసులైతె
కలలను పండింపవచ్చు!

ఉచితానికి ముందుంటడు
కొనడానికి వెనకుంటడు
వస్తువెవరిదైన తనకు
తేరగ రావాలంటడు!.

మనస్సు కోరుకున్నది
బుద్ధీ ఎందుకన్నది
విచక్షణ కోల్పోకని
వివేకం చెబుతున్నది!

అతనికతడే సాటి
ఎవ్వరురారు పోటి
కలహాలు పెట్టడంలో
చురుకైన ఘనపాఠి!

ధర్మకేతన పీఠము
కళా సాహిత్య పథము
రఘువీరుడు స్థాపించిన
తరాల వారసత్వము.!.

–యన్.వి.రఘువీర్ ప్రతాప్
సెల్:9440551552.

నిర్మలమైనట్టి నవ్వు
ఎదను రంజింపగ రువ్వు
ఆయువుకు ఔషదమౌ
ఆరోగ్యంబు మెరుగవ్వు.

పరులకు సాయమందించు
మంచినే పెంపొందించు
చీకట్లను తొలగించే
దివ్వెవయి వెలుగందించు!.

వంచించును వక్రబుద్ధి
కల్పించును దేహశుద్ధి
సజ్జన సాంగత్యమే
కల్గించును ఆత్మశుద్ధి!.

నాటి తరం వారి కథలు నేటి తరానికి

కథల వంతెన

ప్రకృతి

సహజత్వం
ఆరోగ్యకరం
ఆస్వాదనీయం
ఆనందమయం.

అసహజం
అనర్థదాయకం
అవసరానికనష్టకారకం
అనాదరణీయం.

అకృత్రిమం
ఆమోదయోగ్యం
అత్యవసరం
ఆరాధ్యనీయం.

ప్రకృతిని
ప్రేమించు
పరిసరాలను
పరిరక్షించు.

అందాలను
ఆస్వాదించు
ఆనందాలను
అనుభవించు.

నిందుజాబిలిని
వీక్షించు
వదనమును
వెలిగించు.

తారకలను
తిలకించు
తళతళలను
తనువుకివ్వు.

పచ్చదనం
పరికించు
కమ్మదనం
కళ్ళకివ్వు

కొండలను
కాంచు
కుతూహలము
కాయానికివ్వు.

కోనలను
చూడు
కుషీగా
చరించు.

అంబుధిని
అవలోకించు
కెరటాల్లా
ఎగిసిపడు.

ప్రకృతినిప్రేమించు
ప్రతినిత్యంపరికించు
పవిదిప్రాముఖ్యమును
ప్రపంచానికిచాటు



–గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,

1968లో రాసిన కథ

తామరపూలు

కథ

–దాశరథి రంగాచార్య

బాల్యం..

ఆ పదం గారడి చేస్తుంది. ఆ పదం వినగానే మబ్బుల మీద స్వారీ చేస్తున్నట్టూ.. నక్షత్రాలలో ఆడుకుంటున్నట్లూ అనిపిస్తుంది. అలా విహరిస్తూ పోతే చందమామ ఎదురవు తాడు. ఆ చంద్రునిలో ఒక పొన్న చెట్టు ఉంటుంది. ఆ చెట్టు క్రింద ఒక ముసలవ్వ కూర్చుని ఉంటుంది. ఆమె రాట్నం మీద దారం తీస్తుంటుంది. అలా అలా విహరించి దిగివస్తే మా ఇంటి ముందర రెండు చింతచెట్లు గుర్తుకువస్తాయి.

ఆ రెండు చింతలు– వాటి సాంద్రచ్ఛాయలో బంగారు బాల్యం కరిగిపోయింది. అందకుండా పోయింది. దొరక్కుండా పోయింది.

నా బాల్యం వెళ్ళిపోయింది తిరిగి చూడకుండా పోయింది.

కనిపించకుండా పోయింది

మా యింటి ముందరి రెండు చింతలు, చలికాలంలో వెచ్చని నీడ! ఎండ కాలంలో చల్లని నీడ? ఒక్క చింతకింద నర్సిగాని గుడిశ.

నర్సయ్య నా బాల్య మిత్రుడు అతనితో– ఆ చింతల నీడన ఎన్ని ఆటలు ఆడమో గోలీలు ఆడాం. చిర్రగోనె ఆడాం. బిళ్ళంగోడు ఆడాం. మొగల్ పఠాన్ ఆడాం. దాగుడు మూతలు ఆడాం. ఉప్పు చెర ఆడాం.

ఆటలూ! ఆటలూ! అటువంటిదే బాల్యం!

ఉంటుందా వెర్రి బాగులుది! వెళ్ళిపోయింది!

దీపావళి వచ్చిందంటే పండుగలకు పండుగ! టపాకులు– మతాబులూ లేవు కోలలు చేసుకునే వాళ్ళం. వాటిని పోటీపడి గిరగిరా తిప్పేవాళ్ళం. ఒక జ్వాలా వలయం ఒకటి కాదు– రెండు కాదు– అనేక జ్వాలా వలయాలు! ఇంద్రధనస్సులు గిరగిరా తిరుగుతున్నట్లుండేవి.

అప్పుడప్పుడూ మా ఇంటి పక్క సీత వచ్చేది. చింతల నీడకు రవంత దూరంలో బొడ్డుమల్లె పున్నాగ– చెట్టు వుండేది. సీత ఆ పూలు ఏరుకోవడానికి వచ్చేది. తెల్లావారేవరకు బొడ్డు మల్లెలు– నేల కానరాకుండా రాలేవి. సీత పూలు ఏరడం బాగనిపించేది. ఆమెకు వడినిండా పూలు ఏరిపెట్టడం నరదా! నర్సయ్య చెట్టును ఊపుతాడు. పూలు– వానల రాల్తాయి. ఆ రాలడం సీతా, నేనూ సంబరంగా చూచేవాళ్ళం.

సీత వడి నిండితే గంతు లేసుకుంటూ పరిగెత్తేది. మేమిద్దరం చూస్తూ ఉండేవాళ్ళం!

లేడిలా గంతలు చేస్తూ పరిగెత్తెది.

బొడ్డు మల్లెపువ్వు కాడ తుంపి నోట్లో పెట్టుకొని ఊదేవాళ్ళం. సీత కూడా ఎప్పుడు ఆ ధ్వని విని ఆమె కిలా కిలా నవ్వేది! ఆమె కళ్ళు పెద్దవి. అలా నవ్వునప్పుడు పెద్దవి అయ్యేవి.

మేమూ ఆమెతో కలిసి నవ్వుతాం.

కాని సీత నవ్వే వేరు!

ముత్యాలు రాలాయి.

ఒక్కోసారి సీత– వడినిండా పూలతో– కూలి పడిన గుడి స్తంభం మీద పెట్టుకునేది. పూలుతీసి తన వ్రేళ్ళతో సుతారంగా మాల అల్లేది. అలా బారెడు మాల అల్లుతుంటే ఆశ్చర్యంగా చూస్తూ ఆమె పాదాల చెంత కూర్చునేవాణ్ణి!

"వాన కురుస్తదా! చెరువు నిండుతదా!! తామరలు పూస్తయా!! అడిగాను.

"ఓ! కురుస్తది" అన్నారు.

బావి దగ్గరకు ఉరికా. నీళ్ళు తోడా. తప్పేలా నింపా. తప్పేలాలతో తెచ్చి కప్ప మీద నీళ్ళు గుమ్మరించా.

"కప్పతల్లీ! వాన పడెయ్యి. చెరువు నింపు తామరలు పూయించు తల్లీ" అని మొక్కాను.

రోజులు గడుస్తున్నాయి. వాన రాలేదు. చెరువు నిండలేదు తామరలు పూయలేదు.

చెరువు దగ్గరకి వెళ్ళాను. ఏడిచాను. చింతల కిందకి చేరాను. ఆట లు ఆడలేదు. గుడిస్తంభం మీద కూల బడ్డాను. ఊరు బోసిగా ఉంది. వెలితి గా ఉంది. ఏదో పోయినట్లుంది.

''వాన పడదా! చెరువు నిండదా!! తామరలు పూయవా!" నర్సయ్యను అడిగాను.

"వాన కురస్తది. ఇయ్యాళ బోనాలు పడ్తున్నారు" అన్నాడు.

ఆ సాయంత్రం మంచి బట్టలు వేసుకొని బయలుదేరాను ముందు డప్పులవాడు కొమ్ములవాళ్ళు సాగుతున్నారు. వారు కొమ్ములు ఊదినప్పు డు నాకు వింత అనుభూతి కలిగేది. గుండెలో ఉరుము ఉరిమి క్రమంగా జారిపోతున్నట్లనిపించేది. డప్పుల చప్పుడు ఎగరాలనిపించేది. ఎగిరే వాణ్ణి.

వారి వెనుక ఆడవారు. కడవల దొంతరలు– బిందెల దొంతరలు పెట్టుకున్నారు.

"వారు కొమ్ములు ఊదినప్పుడు
నాకు వింత అనుభూతి కలిగేది.
గుండెలో ఉరుము ఉరిమి
క్రమంగా జారిపోతున్నట్లనిపించేది.
డప్పుల చప్పుడు
ఎగరాలనిపించేది."

మేకలకు వేప మండలు కట్టారు. వేపాకు మండలు పట్టుకొని మగవారూ పిల్లలూ ఎగురుతు న్నారు.

వాన కురుస్తదా! చెరువు నిండుతదా! తామరలు పూస్తయా!! అక్కడ ఒకర్ని అడిగాను.

"ఓ! కురుస్తది" అన్నాడు.

తప్పేలలో నీళ్ళు నెత్తిన పెట్టుకొని నేను నడిచాను.

''ఆడపిల్లలు పెట్టుకుంటరు. మగపిల్లలు పెట్టుకోరు" నర్సయ్య అన్నాడు. నేను సిగ్గుపడలేదు తల మీద తప్పేలతో నడిచాను.

ఊరేగింపు చెరువు కట్టకు చేరింది. ముత్యాలమ్మ గుడి ముందు నీళ్ళు గుమ్మరించారు. నేనూ గుమ్మరించాను.

"ముత్యాలమ్మ తల్లీ! వాన పడెయ్యి చెరువునింపు. తామరలు పూయించు" అని అనుకున్నాను.

ఆ రాత్రి వాన కోసం ఎదిరి చూశాను. ఆకాశం మీదనే దృష్టి ఉంచాను. నల్లని ఆకాశంలో తెల్లని చుక్కలు మిలమిలా మెరుస్తున్నాయి. ఆశ మోసుకొని ఒక మబ్బు వచ్చింది. ఆశలు వమ్ము చేసింది. చిటపట చినుకులు రాల్చింది తేలిపోయింది.

రోజులు గడుస్తున్నాయి. వాన రాలేదు. చెరువునిండలేదు. తామరలు పూయలేదు.

"వాన పడదా? చెరువు నిండదా? తామరలు పూయవా? నర్సయ్యను అడిగాను. "ఇయ్యాల సాయెబులు చెరువులో నవాజు చేస్తరట" నర్సయ్య చెప్పాడు.

ఆ సాయంకాలం చెరువు దగ్గరికి వెళ్ళాను సాయెబులు తళతళ మెరిసే చోళీలు వేసుకొని కూడారు. కొంత మందికి గడ్డాలున్నాయి.

"నవాజు చేస్తే వాన కురుస్తదా! చెరువు నిండుతదా!! తామరలు పూస్తాయా!'' అని అడిగాను "ఓ కురుస్తది" అన్నాడు.

సాయెబులంతా చెరువులోకి దిగారు. వరుసలుగా నుంచున్నారు.

నేనూ వారి వెంట సాగాను. నర్సయ్య వెనక్కు లాగాడు. సాయెబులు వరుసలుగా కూర్చు న్నారు. ఏదో చదివారు లేచారు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి వాన కోసం ఎదిరి చూశాను. ఆకాశం మీదనే దృష్టి ఉంచాను. నల్లని ఆకాశంలో తెల్లని చుక్కలు మిలమిలా మెరుస్తున్నాయి. ఆశ మోసుకొని ఒక మబ్బు మళ్ల వచ్చింది. ఆశలు వమ్ము చేసింది. చిటపట చినుకులు రాల్చింది. తేలి పోయింది. రోజులు గడుస్తున్నాయి. వాన రాలేదు. చెరువు నిండలేదు. తామరలు పూయలేదు. చింతల కిందికి వెళ్ళడం మానేశాను. నర్సయ్య మా ఇంటికి వస్తున్నాడు. వానను గురించే ఆలోచన! ఏం చేయాలో తోచదు. ఉన్నట్లుండి ఆకాశమంత పెరగాలనిపించేది. అప్పుడు మబ్బు ల్ను లాక్కొచ్చి కురిపించవచ్చు. మునికాళ్ళ మీదుగా చూస్తే గూడు అందలేదు.

దేవుడు వాన పడెయ్యడం లేదు. దేవుడు చెడ్డవాడా? దేవుని పటం చూచాను. చేతిలో తామర పూవు ఉంది. తామరలంటే దేవుడికీ ఇష్టమే! దేవుడికి తన తామరయే ఇష్టం లాగుంది. చెరువు నిండా తామరలు చూడలేడేమో! దేవుని చేతిలో తామర లాక్కుంటే సరి! చెరువులో తామరలు పూయిస్తాడు! దేవునికి కావాలిగా ఒక పీట వేసుకున్నా పటం అందలేదు.

ఒకనాడు నర్సయ్య ఊరికి వచ్చి చెప్పాడు సీత వచ్చిందని వెళ్ళి చూచాను స్తంభం మీద మౌనంగా కూర్చుంది. అశోకవనంలో సీతలా ఉంది. ఆమె పూలులేవు. ఆమె మాల అల్లడం లేదు. ఆమెలో విషాద ఛ్ఛాయలు కనిపించాయి.

నేను ఆమె పాదాల చెంత కూర్చున్నాను. ఆమె నన్ను చూసింది. మాట్లాడింది. నాకు దుఃఖం వచ్చింది.

"సీతా! వాన పడదా! చెరువు నిండదా?తామరలు పూయవా?" నా మాటలు కన్నీట తడిశాయి.

సీత నన్ను ఒక రకంగా చూసింది. ఆ చూపులోఆర్ద్రత ఉంది. ఆప్యాయత ఉంది.

"రేపు చెరువులో విరాటపర్వం పురాణం చెప్పుతదట. వాన వస్తది. చెరువు నిండుతది. తామరలు పూస్తయి." అన్నది ఆమె మాటల్లో అంతు లేని విశ్వాసం దర్శనం ఇచ్చింది.

''నీ తా! నువ్వొస్తవా చెరువుకు?"

"వస్త కద" అన్నది. ఆమె కళ్ళు తామర రేకులంత అయినాయి.

సీతా, నేనూ జంటగా ఇళ్ళకు చేరుకున్నాం.

రేపురానే వచ్చింది. గ్రామం సొంతం చెరువు దగ్గరే చేరింది. నడి చెరువులో పందిరి వేశారు. బారు గడ్డం తేజోవంతము లయిన నేత్రముల స్వామి తివాచీ మీద కూర్చున్నారు. వారి ముందు వ్యాస పీఠం. వ్యాస పీఠంలో భారతం. వారి ప్రార్థన గంభీ రంగా ఉంది. వారి గొంతు కంచుగంట.

విరాటపర్వం ప్రారంభం అయింది.

సీత మర్రి నీడలో కూర్చున్నది. మాల అల్లుతున్నది. నేను ఆమె పాదాల చెంత కూర్చున్నాను. ఆమె వ్రేళ్ళ కదలిక– మాల అల్లిక చూస్తున్నాను.

"సీత!"

సీత చూసింది.

"చెరువు చూసినవా! బీటలు వారింది."

సీత తొలిసారిగా బాటలు వారిన చెరువును చూసింది. చూస్తూనే ఉంది.

సీత కళ్ళను చూచాను.

ఆమె కనులు ఎండిపోయాయి. ఆమె కనుపాపల్లో బీటలువారిన చెరువు దర్శనమిచ్చింది.

సీత గంభీరంగా ఉంది.

"సీతా!"

"సీతా!" పలుకలేదు.

"వాన వస్తుందా?"

వాన కురుస్తుంది, చెరువు నిండుతుంది. తామరలు పూస్తయి" ఆమె ధ్వనిలో ఆత్రత ఉంది.

సీత కళ్ళను చూశాను.

సీత కళ్ళలో నీరు నిండింది.

ఆమె కనులు నిండిన చెరువుల్లా ఉన్నాయి.

సీత ఆకాశంలోకి చూచింది.

నేనూ ఆకాశంలోకి చూచాను.

మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఏనుగులు గుంపులా సాగి వస్తున్నాయి. చల్లని గాలి వీస్తున్నది.

క్షణాల్లో ఆకాశం మేఘచ్ఛన్నం అయింది.

ఇద్దరమూ ఆకాశాన్నే చూస్తున్నాం.

పెళ పెళార్భాటాలతో ఉరుములు వినిపించాయి.

శిశిర వృక్షాల్లా మెరుపులు మెరిశాయి.

చినుకులు! చినుకులు! చినుకులు–

జల్లు! జల్లు! జల్లు!

జోరున వాన– విస్సురు గాలి

సీతా–నేనూ చెట్టాపట్టాలు పట్టుకొని ఎగిరాం.

వాన నీరు ముక్కు మీదినుంచి కారుతుంటే చప్పరించాం.

వాన దంచుతున్నది.

మేము ఎగురుతున్నాం.

ఆడుతున్నాం.

మంచి మనసు చలించాలి.

అంతే

ప్రకృతి పులకిస్తుంది.

(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)





ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో

భాషా సేవకులకు

విశిష్ట పురస్కారాలు

- ఏపీ అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో ప్రదానం
- సుద్దాల అశోక్‌తేజ, తమ్మారెడ్డి భరద్వాజ కుప్పిలి పద్మ, బైస దేవదాసు, కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులకు జీవన సాఫల్య పురస్కారాలు
- పలువురు సీనియర్ జర్నలిస్టులకు తెలుగు భాషా సేవారత్న పురస్కారాలు

పాత్రికేయ, సినీ రంగాల్లో విశేష సేవలందిస్తున్న పలువురు రచయితలకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, ఏపీ ఎన్ఆర్‌టీ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం జీవన సాఫల్య, తెలుగు భాషా సేవారత్న పురస్కారాలు ప్రదానం చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. రచయితలను పిలిచి గౌరవించినందుకు ప్రభుత్వానికి, అధికార భాషా సంఘానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. తాను పాటతోనే పుట్టి పెరిగానని.. నలభై ఏళ్ళ క్రితం పాటలు రాయడం మొదలు పెట్టానని 30 ఏళ్లలో 3 వేల సినిమా పాటలు రాశానని చెప్పారు.


డా॥ సుద్దాల అశోక్‌తేజకు 'జీవన సాఫల్య పురస్కారం' ప్రదానం చేస్తున్న అతిథులు

ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ ప్రచురించిన "ఆంధ్ర సంపాదక శిఖరాలు" పుస్తకావిష్కరణలో ఎం. బాల గంగాధర తిలక్, పి. వరప్రసాదమూర్తి, మాశర్మ, తమ్మారెడ్డి భరద్వాజ, వెంకట్ ఎస్. మేడపాటి, ఆచార్య పి. రాజశేఖర్ పి. విజయబాబు, ఆచార్య కొలకలూరి ఇనాక్, కొమ్మినేని శ్రీనివాసరావు, డా॥ సుద్దాల అశోక్‌తేజ తదితరులు.

రాములమ్మ సినిమాకు నాతోపాటు రాయించి ఆ పాటనచ్చి నీకు ఎదురులేదు అంతా విజయమే అంటూ నన్ను దీవించిన తండ్రిలాంటివారు దాసరి నారాయణరావుగారు అంటూ గతం గుర్తు చేశారు. సినీ, నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ.. తెలుగు సినీ పరిశ్రమ తెలుగు నేలపై రావడానికి తన తండ్రి, తాను కృషి చేశామని, దానికి దక్కిన గౌరవంగా ఈ పురస్కారాన్ని భావిస్తున్నానన్నారు. ఈ పురస్కారం అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు మాట్లాడుతూ.. పత్రిక, రచనా రంగంలో విశేష సేవలందించిన రచయితలను సన్మానించి, వారిని గౌరవించాలన్న లక్ష్యంతో ఈ పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. తద్వారా తెలుగు భాషకు సేవ చేసేవారిని మరింతగా ప్రోత్సహించాలనేది తమ లక్ష్యమన్నారు. 20 మందికి జీవన సాఫల్య పురస్కారాలు 14 మందికి తెలుగు భాషా సేవారత్న పురస్కారాలు ప్రదానం చేస్తున్నామని వయసు రిత్యా రాలేకపోయిన చిట్టెన్‌రాజుగారికి ఇంటికి వెళ్ళి పురస్కారం అందజేస్తామని తెలిపారు. ఏపీ ఎన్ఆర్‌టీ సొసైటీ అధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారు వెంకట్ ఎస్ మేడపాటి మాట్లాడుతూ.. పురస్కారాల ద్వారా తెలుగు రంగానికి ఆదర్శవంతమైన సేవలు చేసిన వారిని గౌరవిస్తున్నామన్నారు. ఏపీ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలుగు భాషాభివృద్ధికి ఏపీ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ పి. రాజశేఖర్ మాట్లాడుతూ.. అధికార భాషా సంఘం నిర్వహించే అన్ని కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వీసీ కొలక లూరి ఇనాక్, ఏఎన్‌యూ రెక్టార్ పి. వరప్రసాదమూర్తి ప్రసంగించారు. అనంతరం పలువురు రచయితలకు, జర్నలిస్టులకు జీవన సాఫల్య పురస్కారాలు, తెలుగు భాషా సేవారత్న పురస్కారాలు అందజేశారు.

నారీవిజయం నృత్యరూపకం ప్రదర్శించిన శృతకీర్తిని సత్కరిస్తున్న అతిథులు.

జీవన సాఫల్య పురస్కారాలు

తమ్మారెడ్డి భరద్వాజ, సుద్దాల అశోక్‌తేజ, వంగూరి చిట్టెన్‌రాజు, చల్లా అనంతపద్మనాభస్వామి, కుప్పిలి పద్మ, కొమ్మినేని శ్రీనివాసరావు, వీవీఆర్ కృష్ణంరాజు, సి. మదన్‌మోహన్, చలసాని నరేంద్ర, రెంటాల జయదేవ, యాబలూరి సీతారామశర్మ, గుళ్లపల్లి దిన్నాబాబు, రేవూరి ఉమామహేశ్వరరావు, తుమ్మలపల్లి రఘురాములు, గడ్డం కృష్ణమూర్తి, గండూరి రాజశుక, తుర్లపాటి నాగభూషణరావు, నందం రామారావు, బైస దేవదాసు, కలిమిశ్రీ జీవన సాఫల్య పురస్కారాలు అందుకున్నారు.

తెలుగు భాషా సేవారత్న పురస్కార గ్రహీతలు

తెలుగు భాషా సేవారత్న పురస్కారాలు అందుకున్న వారిలో సీనియర్ జర్నలిస్టులు పోతుకూరి శ్రీనివాసరావు, వాకా మంజుల, వీఎంఎన్ ప్రసాద్, వీఎన్ఎన్ కృష్ణకుమార్, నిమ్మరాజు చలపతిరావు, ఘంటా విజయ్‌కుమార్, అంకంరెడ్డి నానాజీ, మాశర్మ, పాలమరశెట్టి గణపతిరావు, జయప్రకాశరావు, పొత్తూరి సుబ్బారావు, బోణం గణేశ్, బి. అశోక్‌కుమార్, చిలుకూరి శ్రీనివాసరావు, పులివర్తి కృష్ణమూర్తి ఉన్నారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నాట్యశాస్త్ర విభాగాధిపతి శృతకీర్తి బృందం ప్రదర్శించిన నారీ విజయం నృత్యరూపకం ప్రేక్షకులను అలరించింది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం

ఏకాంశ కవిత్వం

నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు
9441046839

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1058వ రోజు 'మనసు భాష' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'మనసు భాష' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా సమర్పిస్తున్నాం.
-సంపాదకులు

మౌన భాష

భాషల్లో భేషైన భాష
మనసు పలికే మౌన భాష
వక్ర భాష్యపు భయం లేదు
అపసవ్యపు భావం లేదు
మాటల తూటాలకు ఆస్కారమే లేదు
గాయపరిచే అవసరం రాదు.
పెదవి దాటి పైకి రాని భాష
మనసు పలికే భాష
పుల్ల విరుపుడెరుగని పసందైన భాష.
చెలి మనసు భాష చెలికానికెరుక
అది అర్ధ అంగీకారానికి సూచిక
అర్థించినా, మనసు మాట్లాడిందంటే
అది సంసిద్ధతకు చిహ్నంలే
ప్రేమికుల హృదయాలు
పాడుకొను మౌన గీతాలు
పొందుపరచుకొని వేల అర్థాలు.

-జె.వి.కుమార్ చేపూరి

మధుర భావం

సూర్యోదయం మొదలు
మనిషి మనసులో
ఒక అద్భుత ఆలోచన
మదిని పులకరింప చేసిన
భావాలు
మరపు రాని
మెరుపులాంటి భావాలు
ఎన్నో ఎన్నెన్నో అంశాలు.
అందాలు
మరపురాని అనుభూతి కలిగిస్తూన్న
శృతుల రాగ ఛాయలు
వివరాలు మనసు నిండా
తేనెటీగల్లా భ్రమిస్తూ
సరికొత్త ఆలోచనలు
అనుభూతులు మనసు నిండా
ఆలోచనలు అమృతంగా మారి
వినూత్న భావాల అక్షరాలు
వెన్నెల్లో నక్షత్రాల్లా ఆడుకుంటూ
అలపు లేని ఎన్నో విశేషాలు
జీవితంలో సౌందర్య భాష గా
మదిలో అద్భుతంగా నిలిచిపోయే
జ్ఞాపకాల దొంతర
హృదయంలో
అమృత భావాలు గా మిగిలి
జీవిత కాలం స్ఫూర్తి నిస్తూ
మనసు పొరల్లో అంతర్లీనంగా
ఆడుతూ పాడుతూ వచ్చే
భావాల సౌందర్య రాశి.
జీవితమంతా ఇచ్చేశాశ్వత స్ఫూర్తి
అదే మనసు భాష కీర్తి.

-నారుమంచి వాణీ ప్రభాకరి

మనసే మందిరం

ఆనందమైనా
విషాదమైనా
భయమైనా
ధైర్యమైనా
ప్రేమైనా
ద్వేషమైనా
పుట్టేది మనసులోనే!.
ఆశావహ దృక్పథం నేర్పి
ఆత్మవిశ్వాసం కూర్చి
అదుపులో ఉంచితే
చంచల మనసును
చేయిస్తుంది నీతో చిత్రాలెన్నో
అందిస్తుంది
విజయానందాలెన్నింటినో!.
కరుణ,మానవత్వం నిండిన
మనసే మందిరం
మమతల మధురిమలు
పండిన బ్రతుకే సుందరం!.
ఒక్కలొచ్చిన మనసు
రివ్వున ఎగిరి దిక్కులు దాటి
చేరేటి దూర తీరాలెన్నో
కాంచు తారాదీపాలెన్నెన్నో!.
మౌనమే భాషైన మూగమనసులోన
అణగిఉన్న ఆవేశకావేశాలెన్నో
మానిని మనసున దాగున్న
బడబాగ్నులెన్నో
వెల్లగక్కలేని రహస్యాలెన్నెన్నో!.

-చంద్రకళ దీకొండ

మౌన భాష

మనసు పలికిన భాష
మౌనమైన భాష
హృదయంలో నిలిచిపోయే
జీవన సౌందర్యం.
ఈ మనసుకు
పరిభ్రమణమే ఎక్కువై
నిరంతరం ఏదో తెలియని
మాటలు చెబుతూ
అది నాది -ఇది నీది
నా వాళ్ళు- ఇతరులు
అని చెబుతుంది.
మంచైనా చెడైనా
మనిషికి మనసుతో ముడి
ఎప్పటికీ మనకు
ఆధారం - ఆనందం
దుఃఖమూ
మనచుట్టూ సమాజమంతా
ఆ మనసే.
మనసు చెప్పేది
మనిషి చేస్తాడని కాని
చేయడని కాని చెప్పడమసాధ్యం
వీలైనంత వరకు చేస్తాడు
వీలుకాని వాటిని చేస్తాననుకున్నా
చేయలేని స్థితి.
మనిషికి మనసే ఆత్మ స్వరూపం
అది లేని జగత్తు అంధకారం
మనిషిని మనసులో నిలుపు
మనసును అందరికీ పంచూ
అదే నీ జీవితంలో నేర్చుకో.

- వి. సంధ్యారాణి

దివ్యమైన భాష

మనస్సుకెందుకు
బాధ కలిగిస్తావ్?
అందమైన అద్దం ఈ మనసు
మంచి పాట మనసు నిండు
మంచి పలుకు
మది పులకించు
మంచి ఆలోచన
మనసు ఉరకలేసే
మంచి పరిమళం.
మది అంతా
మనిషి ప్రతిబింబం
సర్వ కళాత్మక
నాట్య విన్యాసం.
మాటలతో
చేతలతో
భాధించేది పరిసరాలే
అందుకే ఆలకించు
మనసు చెప్పు మాట
వెన్నలాంటి భాష.
అమృతం లాంటి భాష్యం
అందని స్వర్గాన్ని అందించు
సుతిమెత్తని సున్నితమైన
స్వభావి
మలుచుకుని తీర్చిదిద్దుతే
అమృతమే
దేవగాంధర్వ గానాలాపనలే.
భక్తితో మనసు కదిలెనా
దైవమే ప్రత్యక్షం
మనసు మందిరమైతే
మాట దైవ స్వరూపం.

-కె.కె.తాయారు

మాటరాని మౌనం

మాటాడని మల్లెమొగ్గ
మనసు ఊసులు
బంధాలు అనుబంధాలు
దూరతీరాల్లో
ఏకాలానివో
రక్తసంబంధం లేకున్నా
బాల్యస్నేహితుల మనసు
పెద్దైనా తరగని గని
జన్మజన్మల బంధాలు వలలో
భ్రూణం ఆలకించు
అమ్మ మాట
గ్రహించు అమ్మ మనసు
మూగమనసు నోరులేకున్నా
ఎదలోని బాధల ఆవేదనలు
ఎదపై ఎదపెట్టి
పలుకలేని మౌనగీతాలు
ఎంచక్కా ఆలపించు
దుస్వప్నం లో ఉలికిపడి
తల్లో భార్యో రోదనం
అశాంతితో అలమటించే ఆత్మలు
దేహాలు దూరతీరాల్లో ఉన్నా
నేనున్నానని మెల్లగా
సవ్వడిలేని ఎదతో ఓదార్పు
గుండె మంటలనార్పే చల్లని తొలకరి జల్లు
కరుడుగట్టిన బండబారిన
కాబూలీవాలా
మున్నీలో కూతుర్ని చూసుకుని
కంటనీరు కారు
రవీంద్రనాథ్ టాగోర్
కాబూలీవాలా మనసు
రాతిగుండె కాదది
మనసు భాషని దూరాన ఉన్న
తన చిన్నారి ముద్దు బిడ్డ పై
కురిపించిన పితృప్రేమ
మేఘ సందేశం మల్లీశ్వరి
మనసుభాషలు చూసి
అర్థం చేసుకునే ఆర్ద్రత
సరిహద్దు గస్తీ లో వీరజవాన్ల
అణిచిన భావాల ఊసులు
దేశ భక్తి పొరల్లో దాగి
తనవారిని కల్సినపుడు
ఉప్పొంగు

-ఎ.రాజ్యశ్రీ

పొగాకు ఉత్పత్తుల వాడకంతో క్యాన్సర్ వ్యాధి

శరీరంలోని ఏదైన ఒక అవయవ భాగంలోని కణజాలం అపరిమితంగా, నియంత్రణ లేకుండా పెరగడంతో పాటు ఇతర కణజాలాలకు వ్యాపించడం వల్ల గడ్డలు (ట్యూమర్స్) ఏర్పడే అనారోగ్య స్థితిని క్యాన్సర్ వ్యాధిగా పిలుస్తారు. అతి ప్రమాదకర ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధికి మూర్తి చికిత్స నేటికీ అందుబాటులో లేదు. క్యాన్సర్ రాకుండా నివారణ చర్యలు, తొలి దశలో గుర్తించుట వల్ల చికిత్సతో నయం చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా మానవాళికి క్యాన్సర్ వ్యాధి పట్ల కనీస అవగాహన, రాకుండా ఉండానికి తీసుకోవలసిన నివారణ చర్యలు, తొలి దశలో గుర్తించే పద్ధతులు లాంటి మౌళిక అంశాలను వివరించే సదుద్దేశంతో 'యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్' వారి చొరవతో ప్రతియేటా 04 ఫిబ్రవరి రోజున "ప్రపంచ కాన్సర్ దినం" పాటిస్తున్నాం. 2022 నుండి 2024 వరకు మూడు ఏండ్ల పాటు 'క్లోజ్ ది కేర్ గ్యాప్' నినాదంతో క్యాన్సర్ పట్ల అవసర ప్రచారాన్ని కల్పించే ఏర్పాట్లు చేశారు. కరోనా వలె క్యాన్సర్ వ్యాధి కూడా ఒకే రకమైన శ్వాసకోశ వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స లాంటి అంశాలను కలిగి ఉంటాయి. 07 నవంబర్‌న ప్రతి ఏట భారత్‌లో 'జాతీయ క్యాన్సర్ అవగాహన దినం' పాటించుట (2014 నుంచి) ఆనవాయితీగా మారిందని మనకు తెలుసు.

క్యాన్సర్ రకాలు: క్యాన్సర్‌లలో 100కు పైగా రకాలు ఉన్నాయి. వీటిలో రొమ్ము, ఊపిరితిత్తులు, నోటి, చర్మ, గర్భాశయ, పాంక్రియాస్, ప్రోస్టేట్, ఎముకలు లాంటి అవయవాలకు క్యాన్సర్ వస్తుంది. క్యాన్సర్‌లలో కార్సినోమా (చర్మ, రొమ్ము, ప్యాంక్రియాస్, ఇతర గ్రంధులకు), సర్కోమా (రక్తనాళాలు, ఎముకలు, కార్టిలేజ్, కొవ్వు, కండరాలకు), మెలనోమా (చర్మ పిగ్మెంట్ కణాలు), లింఫోమా (లింఫోసైట్స్) మరియు ల్యుకేమియా (రక్తం) వర్గాలు ఉన్నాయి. పలు రకాల క్యాన్సర్లలో ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ అతి ప్రమాదకరమైందిగా గుర్తించబడింది. మన దేశంలో ప్రతి రోజు 1300 మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్థులు మరణిస్తున్నారని తేలింది. ఇండియాలో పురుషులకు ఊపిరితిత్తుల క్యాన్సర్, స్త్రీలలో గర్భాశయ క్యాన్సర్‌లు ప్రాణాంతకంగా మారాయి. క్యాన్సర్ కట్టడికి సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమైతే 2030 నాటి ప్రతి ఏట 5.4 మిలియన్ల ప్రజలు కాన్సర్ వ్యాధిగ్రస్తులు, 2.5 మిలియన్ల రోగులు మరణిస్తారని అంచనా వేస్తున్నారు.

భారత్‌లో క్యాన్సర్ విజృంభన: ప్రపంచవ్యాప్తంగా అసంక్రమిత వ్యాధులతో 71 శాతం మరణాలు సమోదు అవుతున్నాయి. ఇండియాలో అసంక్రమిత వ్యాధులతో 63 శాతం మరణాలు జరుగుతుండగా, 9 శాతం మంది క్యాన్సర్ వ్యాధులతో చనిపోతున్నారు. 1975లో ప్రారంభించిన జాతీయ క్యాన్సర్ నియంత్రణ ప్రోగ్రామ్ (నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ ప్రోగ్రామ్) ద్వారా క్యాన్సర్‌కు వైద్య సదుపాయాలను దేశవ్యాప్తంగా నెలకొల్పడం, 1984-85 నుంచి నివారణ చర్యలు, తొలి దశలో గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, హంగేరీ, బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఐర్లాండ్, యూయస్ లాంటి దేశాలలో క్యాన్సర్ బారిన పడిన వ్యాధిగ్రస్థుల శాతం ఎక్కువగా ఉంది. ప్రపంచ క్యాన్సర్ రోగుల్లో 8.17 శాతం వ్యాధిగ్రస్థులు ఇండియాలోనే ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. భారత్‌లో 2.25 మిలియన్ల క్యాన్సర్ రోగులు ఉండగా, ప్రతియేటా 1.1 మిలియన్ల క్యాన్సర్ కొత్త కేసులు నమోదు అవుతున్నాయి. వీటిలో దాదాపు 66 శాతం కేసులు క్యాన్సర్ ముదిరిన తరువాతనే బయట పడడంతో వ్యాధిగ్రస్తుల ప్రాణం కాపాడడం కష్టం అవుతున్నది. ఇండియాలో ప్రతి 8 నిమిషాలకు ఒక మహిళ గర్భాశయ క్యాన్సర్‌తో మరణించడం విచారకరం. భారతీయుల్లో ప్రతి పది మందిలో ఒకరికి తమ జీవితకాలంలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, చనిపోయిన ప్రతి 15 మందిలో ఒకరు క్యాన్సర్ వ్యాధితో మరణిస్తున్నారని అంచనా. 2018లో దేశవ్యాప్తంగా 3.18 లక్షల మరణాలు పోగాకు ఉత్పత్తుల అలవాటు కారణ క్యాన్సర్‌తో జరిగాయని తేలింది. పురుషుల్లో 25 శాతం క్యాన్సర్ మరణాలు నోటి/ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో జరగడం, 25 శాతం క్యాన్సర్ మహిళా మరణాలు రొమ్ము/నోటి క్యాన్సర్‌తో జరుగుతున్నాయి. పొగాకు వాడకంతో 14 రకాల క్యాన్సర్‌లు రావడం గమనించారు. దీనికి తోడుగా ఆల్కహాల్ సేవనం, మాదకద్రవ్యాల దుర్వినియోగం, ఆహారలేమి, పోషకాహారలోపం, అసురక్షిత లైంగిక సంబంధాలు, గాలి కాలుష్యం లాంటి కారణాలతో క్యాన్సర్ వ్యాధి రావచ్చనే కనీస అవగాహన కలిగి ఉండాలి.

వ్యాధి లక్షణాలు, చికిత్స మార్గాలు:

క్యాన్సర్ వ్యాధికి ఎలాంటి ముందస్తు లక్షణాలు కనిపించని కారణంగా రోగ నిర్ధారణ చేయడం కష్టం అవుతున్నది. ఒక వేళ ముందుగా వ్యాధి నిర్ధారణ జరిగితే, చాలా సందర్భాలలో వైద్యంతో నయం చేసే అవకాశం ఉంటుంది. క్యాన్సర్ వ్యాధి లక్షణాలుగా విరోచనాలు, దగ్గు, చర్మంపై మచ్చలు ఏర్పడడం, ఉమ్మితో రక్తం పడడం, రక్తహీనత, రొమ్ములో గడ్డలు, మూత్ర సంబంధ మార్పులు, మలంలో రక్తం పడడం, బీజాలలో గడ్డలు లాంటివి గుర్తించబడతాయి. ఇండియాలో రొమ్ము, గర్భాశయ, ఊపిరితిత్తులు, జీర్ణకోశ, పెద్ద ప్రేగు క్యాన్సర్‌లు మాత్రమే దాదాపు 50 శాతం కనిపిస్తాయి. క్యాన్సర్ వ్యాధి చికిత్సలో ఇమ్యునోథెరపీ, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, హార్మోన్ థెరపీ, టార్గెటెడ్ థెరపీ, స్టెమ్ సెల్ మార్పిడి, శస్త్రచికిత్స, ప్రిసిషన్ మెడిసిన్ లాంటి విధానాలు వాడతారు. శరీర బరువు నియంత్రణ, మంచి పోషకాహార అలవాటు, శారీరక శ్రమ, టీకాలు వేయించుకోవడం, తీవ్రమైన ఎండ పడకుండా జాగ్రత్తలు, పొగాకు ఉత్పత్తులకు అలవాటుకు దూరంగా ఉండడం, క్రమం తప్పకుండా చెకప్ చేయించుకోవడం, శరీరంలో గడ్డలు కనిపిస్తే వైద్యున్ని సంప్రదించడం వంటి సత్వర జాగ్రత్తలు తీసుకోవడం లాంటి జాగ్రత్తల వల్ల క్యాన్సర్ వ్యాధి నివారించబడుతుంది. ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కలిగి, క్రమశిక్షణ గల జీవనశైలితో ఆరోగ్యకర సమాజ స్థాపనలో భాగస్వాములం అవుదాం. క్యాన్సర్‌ను సమాజం నుంచి తరిమి కొడదాం.

-డా బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

పార్లమెంట్ బరిలో కొప్పుల.. లైన్ క్లియర్ చేసిన కేసీఆర్

కరీంనగర్, ఫిబ్రవరి 7: పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ నుండి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీ చేయనున్నారు. గత కొన్ని రోజులుగా పార్లమెంటు బరిలో కారు పార్టీ నుండి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ లలో ఒకరు పోటీ చేస్తారని విస్తృతంగా ప్రచారం జరిగింది. మంగళవారం ప్రస్తుత ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను బరిలో దించాలని నిర్ణయించారు. పెద్దపల్లి ఎంపీ స్థానానికి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని అధినేత కేసీఆర్ కొప్పుల ఈశ్వర్ కు సమాచారం అందించారు. సీపీఐ ఎంఎల్ నుండి టీడీపీలో చేరిన అనంతరం కొప్పుల ఈశ్వర్ మొదటిసారిగా 1994లో మేడారం అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు.

2001లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రారంభించిన ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన కొప్పుల ఈశ్వర్ 2004లో మేడారం అసెంబ్లీ స్థానం నుండి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2008 మేడారం, 2009, 2010లో ధర్మపురి నుండి వరుసగా విజయం సాధించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన అనంతరం 2014లో విజయం సాధించి ప్రభుత్వ చీఫ్ విప్ గా చేశారు. 2018లో ఆరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం కేసీఆర్ మంత్రివర్గంలో ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. విశేష రాజకీయ అనుభవంతో పాటు సింగరేణి కార్మికుల్లో మంచిపట్టున్న కొప్పుల ఈశ్వర్ ను బరిలోకి దించితే పెద్దపల్లి పార్లమెంట్ లో గులాబీ జెండా ఎగరవేయవచ్చని అధినేత కేసీఆర్ భావించి ఈశ్వర్ అభ్యర్థిత్వానికి లైన్ క్లియర్ చేసినట్లు తెలిసింది. అధినేత నుండి గ్రీన్ సిగ్నల్ రావడంతో కొప్పుల ఈశ్వర్ నూతన ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

ఇప్పటికే పార్లమెంటు పరిధిలో జరిగిన సన్నాహక సమావేశాల్లో పాల్గొని కార్యకర్తలకు ధైర్యం నింపుతూ ముందుకు సాగుతున్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ నుండి కొప్పుల ఈశ్వర్ అభ్యర్థిగా ఖరారు కావడంతో మిగతా పార్టీలు అభ్యర్థుల వేటలో పడ్డాయి. ప్రస్తుత ఎంపీ వెంకటేష్ నేతకు కాంగ్రెస్ టికెట్ దాదాపు ఖరారైనట్లు సమాచారం. ఆయనతో పాటు చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీ, మాజీ మంత్రి చంద్రశేఖర్, మాజీ ఎంపీ సుగుణ కుమారి, గోమాస శ్రీనివాస్, గజ్జల కాంతం, అసంపల్లి శ్రీనివాస్, ఊట్ల వరప్రసాద్, శ్యాం, సందీప్ లతో పలువురు కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. కేంద్రంలో అధికారం ఉన్న బీజేపీ బలమైన అభ్యర్థి కోసం వేట ప్రారంభించింది. తాజా పరిణామాలతో పెద్దపల్లి పార్లమెంటు పోరు రసవత్తరంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

బీజేపీకి బాబూమోహన్ రాజీనామా..

హైదరాబాద్, ఫిబ్రవరి 7:సినీ నటుడు, మాజీ మంత్రి బాబూమోహన్ బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. పార్టీలోని తాజా పరిస్థితులతో అసంతృప్తికి గురైన ఆయన పార్టీ నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు మీడియాకు వెల్లడించారు. బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్‌రెడ్డిపైనా తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.

గత కొంతకాలంగా పార్టీలో ఇమడలేకపోయిన పరిస్థితుల్లో పూర్తిగా ఆ పార్టీకి గుడ్ బై చెప్పే నిర్ణయాన్ని తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగానే తీవ్ర అసంతృప్తికి గురైన ఆయన ఆ తర్వాత టికెట్ రావడంతో చల్లబడ్డారు. తాజా రాజకీయ పరిణామాల్లో ఆయన పార్టీ నుంచి పూర్తిగా తప్పుకోడానికి నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

తేలు సందేహం

నరసింహపురం గ్రామంలో ఒక తేలు ఒక చెట్టు వద్ద గల కన్నంలో నివసించేది. అది బయటకు వచ్చి అన్నీ జీవులను కుట్టి అన్నింటికి అపకారం చేసేది.

ఇలా ఉండగా ఒకరోజు ఆ తేలు ఆహారం కొరకై తన కన్నంలో నుండి పైకి వచ్చింది . అది ఎండాకాలం. అది కొద్ది దూరం వెళ్లేసరికి అక్కడ ఒక స్వామిజీ ప్రజలకు మంచి మాటలను చెబుతున్నారు . అది ఆ మాటలను విన్నది. ఆ ప్రజలు వెళ్లిపోయిన తర్వాత ఆ తేలు ఆ స్వామిజీ వద్దకు వెళ్లి "స్వామీ! మీరు చెప్పిన మంచి మాటలను విన్నాను. నేను ఈరోజు నుండి ఎవరికి అపకారం చేయను. నాకు మంచి జరుగుతుందా !"అని ప్రశ్నించింది? అప్పుడు స్వామిజీ "తప్పకుండా జరుగుతుంది" అని అన్నాడు. అది సంతోషంతో ఆహారం సంపాదించుకొని తిని ఇంటికి బయలుదేరింది .

మరునాడు అది ఎప్పటిలాగే ఆహారం కొరకై తిరిగి కన్నంలో నుండి బయటకు వచ్చింది. అప్పుడు మిట్ట మధ్యాహ్నపు ఎండలో చాలా దూరం నడిచిన కొందరు బాటసారులు ఆ ఎండవేడిమి కి తట్టుకోలేక ఆ చెట్టు నీడలో సేద తీరుతున్నారు. అది వారిని కాటువేద్దామని అనుకొంది. కానీ దానికి స్వామిజీ మాటలు గుర్తుకు వచ్చాయి. అది ఆ ఆలోచన మానుకొంది. దానిని ఎవరూ గమనించలేదు.

ఇంతలో ఒక కోతి ఆ చెట్టుపైకి ఒక బొప్పాయి కాయతో చేరింది. అది దానిని కొరికి కొరికి అది గట్టిగా ఉండడంతో విసుగు చెంది ఆ పెద్ద బొప్పాయి కాయను చూడకుండా క్రింద పడ వేసింది.ఆ బొప్పాయి కాయ సరాసరి వచ్చి ప్రమాదవశాత్తు తిన్నగా ఆ తేలు తోకపై పడింది. ఆ దెబ్బకు దాని తోకకుఉన్న విషపు కొండి తెగింది.

వెంటనే అక్కడ ఆ తేలును చూసిన ఒకడు " అదిగో తేలు! తేలు! దానిని చంపండి " అని గట్టిగా అరిచాడు. వెంటనే అక్కడ ఉన్న ఒక వృద్ధుడు "అయ్యో నాయనా! దానికి విషపు కొండి లేదు. అది మనను ఏమీ చెయ్యదు! దాని దారిలో అది పోతుంది. మనకు ఏమీ ప్రమాదం లేదు !"అని అన్నాడు. వారు దానిని చంపకుండా వదలిపెట్టారు.

వెంటనే ఆ తేలు స్వామిజీ వద్దకు వెళ్లి " అయ్యా! ఈరోజు నేను మీ మాటలను విని ఎవరికీ అపకారం చేయలేదు. కానీ నా తోకకు ఉన్న విషపు కొండి ఒక కోతి క్రిందకు విసరిన బొప్పాయి కాయ వల్ల తెగింది. మీరు ఎవరికీ అపకారం చేయకుంటే నాకు మంచి జరుగుతుందని అన్నారు కదా! మరి నా తోకకు ఉన్న కొండి తెగింది. ఇది నాకు మంచి జరగడమేనా!"అని ప్రశ్నించింది? అప్పుడు స్వామిజీ "ఔను! నీవు ఇతరులను కాటువేయలేదు కనుకనే ప్రమా దవశాత్తు నీ కొండి తెగి నీ ప్రాణాలు నీకు దక్కాయి. నీకు ఆ విషపు కొండి ఉండి ఉంటే ఆ కొండి ఉందని ఆ మనుషులు నిన్ను చంపేవారు. ఆ విషపుకొండి తెగడం వల్లనే నీవు బ్రతికావు. ఇది నీకు మంచి జరిగినట్లు కాదా !"అని అన్నాడు.ఆయన మాటలకు తేలు ఎంతో సంతోషించి " ఔను.స్వామీ! మీరు అన్నదినిజమే. ఆ విషపుకొండి నాకు ఉండిఉంటే నేను కూడా గర్వంతో అందరినీ కాటు వేయాలని అనుకునే దానిని. నాకు మంచియే జరిగింది " అని చెప్పి అక్కడినుండి వెళ్లిపోయింది.

-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

లక్ష్యం ! లక్షణం !



ఆనాడు
జనగణమన అధినాయక జయహే
అంటూ బ్రిటీష్ అభికారుల్ని పొగిడి
రాసిన టాగోర్ జాతీయగీతం కన్నా ,
మనలోని జవసత్వాలను నరనరాన
మేల్కొల్పడానికి వందేమాతరమంటూ
రాసిన బంకిమ్ చంద్రుడంటేనే నాకు
ఆదర్శం ! అంతకన్నా ఎక్కువ ప్రాణం !

ఈనాడు ...
జయజయహే తెలంగాణ జననీ జయ
కేతనమంటూ తెలంగాణ కీర్తికిరీటాన్ని
ప్రపంచపటంలో ప్రత్యేకంగా కనబడేలా
ప్రతీ మనసులో వారసత్వ వీరత్వాన్ని
జాగృతపరిచి , కర్తవ్యం నూరిపోసిన
అందెశ్రీ కలం అందరికి ఆదర్శమైంది .
అదే ధైర్యంతో వారసత్వ ఆస్థిత్వాన్ని ,
విజ్ఞానంతో ముందు తరాలకందిస్తూ
విజయస్ఫూర్తి కొనసాగించడమొక్కటే
మనకు ముందున్న లక్ష్యం ! లక్షణం !

(అందెశ్రీ కి శుభాభినందనలు)

- డా. డి. రాజేశ్
9440460490

రూ.2,86,389.27 కోట్లతో ఏపీ బడ్జెట్.. బుగ్గన

అమరావతి, ఫిబ్రవరి 7ఏపీ అసెంబ్లీలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశ పెట్టారు. రూ. 2,86,389.27 కోటతో ఏపీ బడ్జెట్‌ను రూపొందించారు. ఆదాయ వ్యయం రూ.2,30 ,110.41 కోట్లు, మూల ధన వ్యయం రూ.30, 530.18 కోట్లు, రెవెన్యూ లోటు రూ. 24,758.22 కోట్లు, ద్రవ్య లోటు రూ.55,817.50 కోట్లు, జీఎస్డీపీలో ద్రవ్య లోటు 3.51 శాతం, రెవెన్యూ లోటు 1.56 శాతం ఉన్నట్లు బుగ్గన తెలిపారు. ఏ వర్గాన్నీ మర్చిపోకుండా వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తితో బడ్జెట్‌ను రూపొందించినట్లు బుగ్గన వెల్లడించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని బుగ్గన పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలు చేశామని చెప్పారు. మేనిఫెస్టోను సీఎం జగన్ పవిత్ర గ్రంథంలా భావించారని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు.రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలు చేశామని చెప్పారు. అంబేద్కర్ ఆశయాలే తమ ప్రభుత్వానికి ఆదర్శమన్నారు. చాణుక్యుడిలా రాష్ట్రాన్ని సీఎం జగన్ పాలిస్తున్నారన్నారు. 1000 పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేశామని మంత్రి బుగ్గన పేర్కొన్నారు.

ఇక జగనన్న విద్యా కానుక ద్వారా 47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందని బుగ్గన చెప్పారు. రూ. 3,367 కోట్లతో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశామన్నారు. రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాను 26కు పెంచామన్నారు. 52 రెవెన్యూ డివిజన్లను 77కు పెంచాశామని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా గత ప్రభుత్వం కన్నా నాలుగు రెట్లు ఎక్కువ ఖర్చు చేశామన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా 35 లక్షల పిల్లలకు ప్రయోజనం చేకూర్చామన్నారు. ఐదేళ్లుగా బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం తనకు దక్కిందని ఈ సందర్భంగా బుగ్గన హర్షం వ్యక్తం చేశారు.సుపరిపాలన, సామర్థ్య ఆంధ్ర, మన మహిళా మహారాణుల ఆంధ్ర, సంపన్నుల ఆంధ్ర, సంక్షే ఆంధ్ర, భూ భద్ర ఆంధ్ర, అన్నపూర్ణ ఆంధ్ర ఆంశాల ఆధారంగా బడ్జెట్‌ను రూపొందించా మన్నారు. రూ. 2 లక్షల 86 వేల 389 కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను అసెంబ్లీలో మంత్రి బుగ్గన ప్రవేశ పెట్టారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 1142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బోధనా ఆస్పత్రులకు రూ. 16,852 కోట్లు ఖర్చు చేసినట్లు బుగ్గన పేర్కొన్నారు.

విదేశాల్లోని 50 ఉన్నత విద్యాలయాల్లో చదువుకునే విద్యార్థులకు సాయం అందించామన్నారు. డ్రాప్ అవుట్ శాతం 20.37 నుంచి 6.62 శాతానికి తగ్గిందని తెలిపారు. 34 లక్షల మందికి ఉచితంగా విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ చేశామన్నారు. జగనన్న విద్యా వసతి దీవెనకు రూ. 4,267 కోట్లు కేటాయించామన్నారు. జగనన్న విద్యా దీవెనకు రూ.11901 కోట్లు విడుదల చేశామని మంత్రి బుగ్గన పేర్కొన్నారు.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌ను కలిసిన నిర్మల్ ఎమ్మెల్యే

ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీజేపీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, శంకరహరీష్‌బాబులు ఢిల్లీలో కలిశారు. కేంద్రం గ్రామీణ ప్రాంతాల కోసం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా నిధులు రాష్ట్రానికి ఇస్తే వాటిని